ప్రజాశక్తి

మంగళవారం 4 ఏప్రిల్ 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ఉత్తరాంధ్రపై టిడిపి దృష్టి

◆ బిసి నేతలతో విశాఖలో సమావేశం ◆ 5న పిఎం.పాలెంలో సదస్సు

◆ హాజరుకానున్న పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు



విశాఖ నగరంలోని టిడిపి కార్యాలయంలో సమావేశమైన ముఖ్య నేతలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

శాసన మండలి ఫలితాలతో ఉత్తరాంధ్రలో తెలుగుదేశం పార్టీకి జవసత్వాలు వచ్చినట్టయింది. 2019 ఎన్నికల తర్వాత అంతా వైసిపి హవాయే నడుస్తోందని భావించిన నాయకులు, కార్యకర్తల్లో తాజాగా 'మండలి' గెలుపు ఒక ఊపునిచ్చిందనే చెప్పొచ్చు. ఇదే తడవుగా ఆ పార్టీ అధిష్టానం ఉత్తరాంధ్ర బిసి నేతలతో విశాఖలో సోమవారం ఒక సమావేశం నిర్వహించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ తరహా ఉత్సాహం వైసిపిలో నేడు కానరావడం లేదు. అధికారం తమ చేతిలో ఉండడంతో వారి ప్రాధాన్యతలు సమీకరణలపై ప్రస్తుతం లేవు. టిడిపి రాష్ట్రంలో 2019 ఎన్నికల్లో ఘోరంగా పరాజయం పాలైంది. అయితే, విశాఖలో నాలుగు అసెంబ్లీ సీట్లు దక్కించుకుని బెటర్ అనిపించుకుంది. ఆ తరువాత చోటుచేసుకున్న పరిణామాలతో మొత్తంగా పార్టీ చచ్చిపోయిందనే ఆ పార్టీ కార్యకర్తలంతా భావిస్తున్న తరుణంలో మండలి ఫలితాలు చీకట్లో దివిటీ మాదిరిగా వారికి కనిపించాయి.

ఉత్తరాంధ్ర ఊపుతో రాష్ట్ర మంతటా సభలు

ఉత్తరాంధ్ర ఫలితాలతో టిడిపి నిస్తేజం నుంచి లేచినట్టయింది. దీంతో సమావేశాల ఊపు పెంచింది. ఆ పార్టీ అధినేత చంద్రబాబునాయుడు ఈ నెల 5న ఉత్తరాంధ్రకు చెందిన ముఖ్య నేతలు, కార్యకర్తలతో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ పిఎంపాలెంలోని ఓ కన్వెన్షన్ సెంటర్‌లో పార్టీ సమీక్షా సమావేశం, చర్చల్లో పాల్గొనేందుకు విచ్చేస్తున్నారు. పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజం నింపేందుకు చంద్రబాబు ఈ విధంగా ప్రయత్నాలు ప్రారంభించారు. జగన్ పాలనపై జనంలో అసంతృప్తి కనిపించడం, భవిష్యత్తులో పొత్తు పొడిచే అవకాశాలున్న జనసేన సభలకు జన స్పందన రావడంతో కలిసొచ్చే అంశంగా మిగతా 2లో..



విశాఖలో పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ మల్లికార్జున, డిఇఒ చంద్రకళ

తొలిరోజు 'పది' పరీక్ష ప్రశాంతం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పదో తరగతి తొలి రోజు పరీక్ష విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ప్రశాంతంగా సాగింది. విశాఖ జిల్లాలో తొలిరోజు పరీక్షకు 27987 మంది హాజరుకావాల్సి ఉండగా 27855 మంది హాజరయ్యారు. 132 మంది హాజరు కాలేదు. తొలిరోజు ఇద్దరు డిబార్ అయ్యారు. పరీక్షా కేంద్రాలను విశాఖ కలెక్టర్ మల్లికార్జున, డిఇఒ ఎ.చంద్రకళ పరిశీలించారు.

(వార్తలు లోపలి పేజీల్లో..)

బాలల హక్కుల పరిరక్షణ చర్యలు భేష్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జిల్లాలో బాలల హక్కుల పరిరక్షణకు తీసుకున్న చర్యలు అభినందనీయమని నేషనల్ కౌన్సిల్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ సభ్యులు డాక్టర్ ఆర్‌జి.ఆనంద్ అన్నారు. సోమవారం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయనకు కలెక్టరేట్ వద్ద జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున స్వాగతం పలికారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆనంద్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మిగతా 2లో..

అకాల వర్షం, గాలితో పంట నష్టం

▶ వార్త 3లో..

నష్టపరిహారం చెల్లింపులో వివక్ష

▶ వార్త 8లో..

నర్సీపట్నం మున్సిపల్ వైస్‌చైర్మన్ రాజీనామా

▶ వార్త 8లో..



నిరసన తెలుపుతున్న సిపిఎం జగదాంబ జోన్ నాయకులు, కార్యకర్తలు

కేంద్ర ప్రభుత్వ భారాలపై నిరసన

ప్రజా వ్యతిరేక విధానాలు తగవు : సిపిఎం వార్త 2లో..

సంతృప్తికర ఫలితాలు

◆ కలెక్టరేట్‌లో ఈ - ఆఫీసు ద్వారా సేవలు ◆ 80 పరిశ్రమల్లో సేఫ్టీ ఆడిట్

◆ ప్రథమ స్థానంలో ఆక్వా జోన్ ◆ రెండో స్థానంలో జగనన్న పాలవెల్లువ

◆ పురోగతిలో ఇళ్ల నిర్మాణం ◆ 95 శాతం 'స్పందన'

◆ అనకాపల్లి జిల్లాకు ఏడాది సందర్భంగా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

ఏడాది కాలంలో సంతృప్తికర ఫలితాలు సాధించామని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. ప్రభుత్వ శాఖాధిపతులతో సమన్వయం చేసుకొని ప్రభుత్వ నిర్దేశిత పథకాలను అమలుచేయడంలో మంచి కృషి జరిగిందన్నారు. అనకాపల్లి జిల్లా ఏర్పడి మంగళవారం నాటికి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా సోమవారం తనను కలిసిన విలేకరులతో ఈ ఏడాది అనుభవాలు, సాధించిన ఫలితాలు, ముందున్న కర్తవ్యాలను ఆయన వివరించారు. కొత్త జిల్లాలో పని, పరిపాలన, సేవలు అందించడానికి కొంతసమయంతీసుకున్నా, అన్ని శాఖల పని గాడిలో పడ్డంతో మెరుగైన ఫలితాలు సాధించగలుగుతున్నామన్నారు. జిల్లాలో ఉగాది నాటికి 10,760 ఇళ్ల నిర్మాణాలకుగానూ పదివేల ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయగలిగామన్నారు. ఏడాదిలో జరిగిన 52 స్పందన కార్యక్రమాల్లో వచ్చిన 17,098 దరఖాస్తుల్లో 350 మినహా అన్ని సమస్యలూ పరిష్కారమయ్యాయన్నారు. పరిష్కారంకాని వాటిలో ఎక్కువభాగం వ్యక్తిగత, కుటుంబ భూ వివాదాలు వంటివి వున్నాయన్నారు. కలెక్టరేట్‌లో వంద శాతం ఈ - ఆఫీసు ద్వారా సేవలందిస్తున్నామన్నారు. తహశీల్దార్ కార్యాలయాలు, రెండు ఆర్‌డిఒ కార్యాలయాల్లో ఈ - ఆఫీసుల నుంచి శత శాతం సేవలు ఆరు నెలల్లో ప్రారంభమవుతాయన్నారు. 22 ఎ సమస్యల పరిష్కారం గతం కంటే వేగంగా జరుగుతోందన్నారు. అగ్రికల్చరల్ మోనటరింగ్, ఇండస్ట్రియల్ ప్రమోషన్, రహదారి భద్రత, సాంఘిక సంక్షేమ శాఖలు సహా వివిధ శాఖల మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ఉత్తరాంధ్రపై టిడిపి దృష్టి

టిడిపి భావిస్తోంది. బిసిల్లో ఉండే చిన్న తరగతుల సమస్యలను అధికారంలో ఉన్నప్పుడు గాలికొదిలేసిందన్న ఆరోపణలు టిడిపిపై లేకపోలేదు. ఇప్పుడు వారిని దగ్గర చేసుకునేందుకు ప్రయత్నిస్తోంది.

ఎమ్మెల్సీ ఫలితాలు టిడిపి సొంత ఘనతా?

ఇప్పటికే ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కొంతమంది నిరుద్యోగ పట్టభద్రులు జగన్ పాలనతో విసుగు చెందిన సంగతి తెలిసిందే. దీంతో ప్రత్యామ్నాయం కోసం చూసి మండలి ఎన్నికల్లో టిడిపికి ఓటేశారు. ఉత్తరాంధ్రలో తమ నాయకులపై ప్రభుత్వ నిర్బంధం అంటూ చేసిన ఆందోళన, అలజడులు మినహాయిస్తే ప్రజా సమస్యలపై టిడిపి పోరాడిందెక్కడా లేదు. అయినప్పటికీ వైసిపి నిరంకుశపాలన, విధానాలు తెలుగుదేశంకు మండలి ఎన్నికల్లో ఓటేసేలా చేశాయి.

గంటా యాక్టివ్

మండలి ఫలితాల సరళి అనంతరం మాజీ మంత్రి, ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పార్టీ కార్యక్రమాల్లో కనిపిస్తున్నారు. తాను స్టీల్‌ప్లాంట్ పోరాటంలో పాల్గొనడం కోసం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తున్నట్టు చెప్పి విశాఖ నుంచి రెండేళ్ల పాటు పత్తాలేకుండా పోయిన గంటా... మరలా ఆ పార్టీలో తన సామాజిక తరగతిని అడ్డం పెట్టుకుని రింగు తిప్పేందుకు సిద్ధమయ్యారు. అంతకు మునుపు వరకూ టిడిపిని లెక్క కూడా చేయకుండా ముఖం చాటేశారు. తాజాగా రాజకీయాల్లో ఆయన తన క్యూమనడంలో మరో సీనియర్ నేత చింతకాయల అయ్యన్న పాత్రుడు పార్టీ కార్యక్రమాల్లో తన చురుకుదనాన్ని తగ్గించారు. తొలినుంచీ వీరిద్దరి మధ్య ఈ వైరం మెయింటైన్ అవుతున్న విషయం తెలిసిందే. కులాల వారీగా, ప్రాంతాల వారీగా సమీక్షలు, సమావేశాలు జరిపి పార్టీ శ్రేణుల్లో ఉత్తేజం నింపేందుకు టిడిపి ప్రయత్నిస్తున్నట్టు తాజా పరిణామాలతో అర్థమవుతోంది.

సంతృప్తికర ఫలితాలు

జిల్లా స్థాయి సమావేశాలు సకాలంలో నిర్వహించి, లక్ష్యాలు ఏర్పర్చుకొని పనిచేయడంతో ఆ మేరకు ప్రగతి కనిపిస్తోందన్నారు.

రాష్ట్రంలోని వైద్య, ఆరోగ్య శాఖకు సంబంధించి అన్ని కొలమానాల్లో అనకాపల్లి జిల్లా ఐదో స్థానంలో ఉందన్నారు. 80 పరిశ్రమల్లో సేఫ్టీ ఆడిట్ పూర్తయిందని, మిగిలిన పరిశ్రమల్లో సేఫ్టీ ఆడిట్ నిర్వహించి ప్రమాదాల నివారణకు కృషి చేస్తున్నామని అన్నారు. 143 గ్రామాల్లో భూముల రీ సర్వే పూర్తయిందన్నారు. జగనన్న పాల వెల్లువ పథకం అమల్లో 148 కేంద్రాల ద్వారా రోజుకు 20 వేల లీటర్ల పాలుసేకరించి రెండో స్థానంలో వున్నామన్నారు. జిల్లా భౌగోళిక విస్తీర్ణం తక్కువ కావడంతో పర్యవేక్షణ పెరిగిందన్నారు. 250 గ్రామ సచివాలయాలను సందర్శించానన్నారు. భవిష్యత్తులో గ్రామ, వార్డు సచివాలయాల నుంచి ప్రజలకు సేవలందించడం, సమస్యలకు పరిష్కారం లభించేలా వాటిని తీర్చిదిద్దాల్సివుందన్నారు.

క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఎన్ఎడిబి నిర్వాసితుల సమస్యలకు త్వరలో పరిష్కారం లభిస్తుందన్నారు. మాతా, శిశుమరణాల నియంత్రణకు గర్భిణులకు రవాణా సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. ఆక్వా జోన్ అమల్లో ప్రథమ స్థానంలో నిలిచామన్నారు. పెట్రోలియం యూనివర్సిటీ, మెడికల్ కాలేజీ స్థల సమస్య పరిష్కారం చేయడంతో నిర్మాణాలు ప్రారంభమయ్యాయన్నారు.

పర్యవేక్షణ పెంచగలిగాం

గౌతమి శాలి, ఎస్‌పి, అనకాపల్లి జిల్లా



'రోడ్డు ప్రమాదాల నియంత్రణకు తీసుకున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. జనవరి నుంచి మార్చి వరకు రోడ్డు ప్రమాదాలు తగ్గాయి. రహదారి ప్రమాద ప్రదేశాలను గుర్తించి అవగాహన కల్పిస్తున్నాం. అన్యాయం జరిగితే చెప్పుకొనేందుకు వెనుకడుగువేయొద్దని చెబుతున్నాం. తప్పుచేయడానికి భయపడాలి. అన్యాయం జరిగితే ధైర్యంగా చెప్పడానికి పోలీసు స్టేషన్‌కు అందరూ రావాలి. ఆ తరహా అవగాహన, ఆలోచన పెంపొందిస్తున్నాం. త్వరితగతిన ఛార్జిషీట్ వేయడానికి పరిమితంకాకుండా కోర్టు మోనటరింగ్ సిస్టమ్‌ను బలోపేతం చేశాం. అందువల్ల శిక్షలు పెరుగుతున్నాయి. లైంగిక వేధింపులు, ర్యాగింగ్ జరగకుండా క్యాంపస్ కమిటీలు ఏర్పాటుచేశాం. గంజాయి రవాణా, అమ్మకాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తున్నాం. గంజాయి రవాణా చేస్తున్న వారిని పట్టుకోవడంతో పాటు గంజాయి ఎవరి నుంచి ఎవరి ద్వారా, ఎక్కడకు తీసుకెళ్తున్నారన్న వివరాలు సేకరించి కేసులు నమోదు చేస్తున్నాం. కొత్త జిల్లాలో అత్యంత దగ్గరగా పర్యవేక్షించే అవకాశం రావడంతో మంచి సేవలు అందించగలుగుతున్నాం' అని ఎస్‌పి గౌతమి శాలి మీడియాకు వెల్లడించారు. అనకాపల్లి జిల్లా ఆవిర్భవించి ఏడాది కావొస్తున్న నేపథ్యంలో ఆమె మాట్లాడారు.

బాలల హక్కుల పరిరక్షణ చర్యలు భేష్

మాట్లాడుతూ జిల్లాలో బాలల హక్కుల పరిరక్షణకు తీసుకున్న చర్యలను వివరించారు. బాల్య వివాహాల నిర్మూలనపై దృష్టి పెట్టామని, దీనిపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. బాల్య వివాహాలు చేయడానికి సిద్ధపడిన తల్లితండ్రులకు అవగాహన కల్పించి, వాటిని ఆపివేయిస్తున్నామని అన్నారు. ముఖ్యంగా బాలికా విద్యకు ప్రాధాన్యత ఇస్తూ, బాలురతో సమానంగా బాలికలు కూడా డిగ్రీ లేదా ఇతర ఉన్నత చదువులు చదివేలా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో డిఆర్‌ఒ శ్రీనివాసమూర్తి, మాతా శిశు సంక్షేమ శాఖ పీడీ వెంకటేశ్వరి, ఐసిడిఎస్ సిబ్బంది, డిసిపి తదితరులు పాల్గొన్నారు. అనంతరం దీనదయాళ్‌పురంలో ఉన్న ప్రభుత్వ బాలుర, ఆదర్శనగర్‌లో ఉన్న ప్రభుత్వ బాలికల పరిరక్షణ కేంద్రాలను తనిఖీ చేశారు.

కేంద్ర ప్రభుత్వ భారాలపై సిపిఎం నిరసన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కేంద్ర ప్రభుత్వం తాజాగా యుపిఐ లావాదేవీలపై వేసిన పన్నును, టోల్‌ఛార్జీల పెంపును రద్దు చేయాలని, మందుల ధరలను పెంచుతూ చేసిన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం సిపిఎం జగదాంబ జోన్ కన్వీనర్ ఎం.సుబ్బారావు అధ్యక్షతన వినూత్న రీతిలో పార్టీ కార్యకర్తలు నిరసన తెలిపారు. పార్టీ కార్యాలయం నుంచి జగదాంబ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు వై.రాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెద్ద నోట్లు రద్దుచేసి, క్యాష్‌లెస్ ట్రాన్సక్షన్ పద్ధతి ప్రవేశపెట్టి గూగుల్ పే, ఫోన్ పే యాప్స్ ద్వారా కొనుగోలు, అమ్మకాలను ప్రోత్సహించిందన్నారు. తద్వారా కోట్లాది రూపాయలు అమెరికా కంపెనీలకు ధారాదత్తం అవుతున్నాయన్నారు. దీనికి తోడు ఈ సేవలపైన యూజర్ ఛార్జీలు వేయడం దారుణమన్నారు. పెంచిన టోల్ ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయన్నారు. ఒక పక్క జీతాలు పెరగకపోవడం, మరోపక్క భారాలు పెరగడం, రూపాయి విలువ క్షీణించడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. సిఐటియు జగదాంబ జోన్ ప్రధాన కార్యదర్శి కెవిపి చంద్రమౌళి మాట్లాడుతూ 2013 తరువాత మందులపై భారీ ఎత్తున 12.1 శాతం ధరలను పెంచడం ఇదే మొదటిసారి అన్నారు. మందుల ఖర్చుల భారంతో పేదలు మరింత ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కోనున్నారని తెలిపారు.

సిఐటియు జిల్లా కార్యదర్శి జి.అప్పలరాజు మాట్లాడుతూ రాష్ట్రానికి రావలసిన జిఎస్‌టి వాటా, పోలవరం, రాజధాని నిర్మాణాలకు నిధులు రాబట్టలేని ముఖ్యమంత్రి పాలనలో ఇప్పుడు ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో విజయ, రామారావు, కె.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బిసిలకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : బిసిలకు న్యాయం చేయాలని ఉత్తరాంధ్ర అఖిలపక్షాల, బిసి సంఘాల ఐక్య కార్యాచరణ రౌండ్ టేబుల్ సమావేశం పేర్కొంది. సోమవారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఈ సమావేశంలో టిడిపి, సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన బిసి నాయకులతోపాటు, వివిధ బిసి సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టిడిపి అనుబంధ రాష్ట్ర బిసి ఫెడరేషన్ అధ్యక్షుడు, మాజీ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం బిసి తరగతుల మధ్య చిచ్చు పెట్టి నాలుగేళ్లగా రాజకీయాలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, సిపిఎం నాయకులు బి.జగన్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, టిడిపి విశాఖ జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, మాజీ మంత్రి కొండ్రు మురళీమోహన్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ, కాంగ్రెస్ బిసి విభాగం నాయకులు కొనతాల శ్రీనివాసరావు, ఈర్లే శ్రీరామమూర్తి మాట్లాడారు.

ఉర్లోవలో మైనింగ్‌పై గ్రామ సభ నిర్వహించాలి

ప్రజాశక్తి - రావికమతం : ఉర్లోవ రెవెన్యూలో ఎం మైఖేల్ ఆంటోనీ గ్రానైట్ సంస్థకు పర్యావరణ అనుమతుల నిమిత్తం తక్షణం గ్రామ సభ నిర్వహించాలని కొమిరి గ్రామ సచివాలయం వద్ద గిరిజనులు సోమవారం ధర్నా నిర్వహించారు. రెవెన్యూ అధికారులు, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, కొంతమంది స్థానిక నాయకులు కుమ్మక్కై, ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న విజె.పురం రెవెన్యూలో మంగళవారం జరగబోయే పర్యావరణ అనుమతి సభలో ఎవరికీ మాట్లాడడానికి అవకాశం ఇవ్వకుండా చేశారన్నారు. గ్రానైట్ ఎఫెక్ట్ ఏరియాతో సంబంధం లేకుండా పర్యావరణ అనుమతి సభను నిర్వహించడం దారుణమన్నారు. సమస్యను పరిష్కరించకుంటే పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.



సిపిఎం ఆధ్వర్యాన ధర్నా చేస్తున్న గిరిజనులు, గ్రామస్తులు

ధర్నాలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.గోవిందరావు, కొమిరి గ్రామ మహిళా సంఘం నాయకులు సోలాం లక్ష్మి, బురిగ నూకరత్నం, గిరిజన సంఘం నాయకులు సోలం రాజబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ల్యుమినస్ హైకెపాసిటీ ఇన్వెర్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పవర్ బ్యాకప్, రెసిడెన్షియల్ సోలార్ స్పేస్‌లో నమ్మకమైన బ్రాండ్‌గా పేరొందిన ల్యుమినస్ పవర్ టెక్నాలజీస్ సరికొత్త శ్రేణి ప్యూర్‌సైన్ ఉత్పత్తులను వేసవి నేపథ్యంలో విడుదల చేసింది. ఈ సందర్భంగా నగరంలోని ఓ హోటల్‌లో జరిగిన మీడియా సమావేశంలో ల్యుమినస్ పవర్ టెక్నాలజీస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, మాన్యుఫాక్చరింగ్ అండ్ గ్లోబల్ సప్లయ్ చైన్ బాధ్యులు రాజీవ్ గంజు మాట్లాడారు. తాజాగా గృహ, వాణిజ్య విభాగాల అవసరాలను తీర్చేందుకు తాము ఇన్వెర్టర్లను అందుబాటులోకి తెచ్చామన్నారు. లిథియం అయాన్ బ్యాటరీలను విడుదల చేశామన్నారు. కార్యక్రమంలో ల్యుమినస్ పవర్ టెక్నాలజీస్ చీఫ్ స్ట్రాటజీ, ట్రాన్స్‌ఫర్మేషన్ అండ్ మార్కెటింగ్ ఆఫీసర్, సీనియర్ వీపీ నీలిమ బుర్రా తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్పందనకు 59 ఫిర్యాదులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగర పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన స్పందనకు 59 మంది నుంచి ఫిర్యాదులు అందాయి. సిపి శ్రీకాంత్ ఫిర్యాదుదారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పోలీసు శాఖలోని పలువురు అధికారులు పాల్గొన్నారు.

బాలినేని బినామీల భూకబ్జాపై ఫిర్యాదు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వైసిపికి చెందిన మాజీ మంత్రి, ఒంగోలు నియోజకవర్గ శాసనసభ్యులు బాలినేని శ్రీనివాస్ రెడ్డి అండదండలతో కొందరు బినామీలు అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలో వందల కోట్ల రూపాయల ప్రభుత్వ భూములను కబ్జా చేశారంటూ 22వ వార్డు జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ విశాఖ జిల్లా కలెక్టర్‌కు స్పందనలో సోమవారం ఫిర్యాదు చేశారు. భూకబ్జాల వివరాలను అందజేశారు.

సంత వేలం పాట

చింతూరు : స్థానిక సంతకు వేలం నిర్వహించగా చివరకు రూ5.99 లక్షలకు చింతూరు బాబా ఎస్ఎస్‌జి గ్రూప్ దక్కించుకుంది. వేలంపాటలో పలువురు పాల్గొన్నారు

శిథిలావస్థలో తుపాను భవనం

తొలగించాలని స్థానికుల వేడుకోలు


పాండ్రంగిలో శిథిలావస్థలో ఉన్న తుపాను రక్షిత భవనం

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని పాండ్రంగి పంచాయతీలో ఉన్న తుపాను భవనం శిథిలావస్థలో ఉంది. పదేళ్లుగా ఈ భవనానికి ఆలనాపాలనా లేక పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. భీమిలి నియోజకవర్గం గోస్తనీ తీర ప్రాంతాల్లోని పొట్నూరు, మద్ది, కృష్ణాపురం, పాండ్రంగి గ్రామాలు ఉన్నాయి. అప్పట్లో గోస్తని నది సంవత్సరానికి సుమారు పదిసార్లు పొంగి ప్రవహించేది. అప్పట్లో గోస్తనీ నదిపై ఎటువంటి వంతెనలూ లేకపోవడంతో నీటి ప్రవాహం ప్రమాద స్థాయిలో ఉన్నప్పుడు గ్రామస్థాయిలో తుపాన్ రక్షిత భవనం ఏర్పాటుకు అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. వరదల సమయాల్లో ప్రజలకు రక్షణ కల్పించి, సహాయ సహకారాలు అందించాలని అప్పట్లో తుపాను రక్షిత భవనాలు నిర్మించారు. 1989లో అప్పటి ఎమ్మెల్యే ఆర్ఎస్‌డిపి అప్పలనరసింహరాజు శాసనసభ ప్రత్యేక నిధుల నుంచి పాండ్రంగిలో తుపాను రక్షిత భవనాన్ని నిర్మించారు.

ఈ భవనాలు నిర్మించిన తర్వాత వర్షాభావ పరిస్థితులు తలెత్తాయి. దీంతో గోస్తనీ నదికి నీటి ప్రవాహం తగ్గింది. దీంతో ఈ భవనాలు నిరుపయోగంగా మారాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ఇప్పుడు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. మద్ది, కృష్ణాపురం గ్రామాల్లోని తుపాను రక్షిత భవనాలను పూర్తిగా తొలగించి ఆ స్థానంలో వేరే నిర్మాణాలు చేపట్టారు. పాండ్రంగి గ్రామంలో ఉన్న భవనంలో కొంతకాలం ప్రాథమిక పాఠశాల, మరి కొంతకాలం అంగన్‌వాడీ కేంద్రం నడిపారు. శిథిలావస్థకు చేరడంతో వాటిని ఆపేశారు. ప్రస్తుతం 10 సంవత్సరాలుగా ఉపయోగంలో లేకపోవడంతో పూర్తిగా పడిపోవడానికి సిద్ధంగా ఉంది. ఈ భవనం గ్రామ ప్రధాన రహదారికి పక్కనే ఉంది. సమీపంలో నివాస ప్రాంతాలు అంగన్‌వాడీ కేంద్రం ఉంది. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తోందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ భవనాన్ని తొలగించాలని ఆ గ్రామానికి చెందిన మహంతి అప్పలరమణ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశారు. అయినా ఎవరూ స్పందించలేదు. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి ఈ భవనాన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.


ఆశా కార్యకర్తను సన్మానిస్తున్న సర్పంచ్ సంతోషి

ఆశా వర్కర్‌కు సత్కారం

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని తాటితూరు గ్రామ పంచాయతీకి చెందిన ఉద్యోగ విరమణ పొందిన ఆశా కార్యకర్త నీలాపు అప్పలకొండను సర్పంచ్ సిరిగిడి సంతోషి, ఎంపిటిసి సభ్యులు ఉండ భట్ల ఆదిలక్ష్మి గ్రామ పెద్దలు ఈశ్వరరావు, దుంపల ప్రభాకర్, వీఆర్వో పి.శ్యామ్‌సుందర్, పంచాయతీ కార్యదర్శి శంకర్ జగన్నాధ్ తదితరులు సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె సేవలను కొనియాడారు.

'ఉపాధి' కూలీలపై తేనెటీగల దాడి

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని పొట్నూరు గ్రామంలో సోమవారం ఉపాధి హామీ చట్టం కూలీలపై తేనెటీగలు దాడిచేశాయి. ఈ దాడిలో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిని 108 సహాయంతో రేవిడి పిహెచ్‌సికి తరలించారు. వారికి పిహెచ్‌సి వైద్యాధికారి స్వప్న ప్రథమ చికిత్స అందించారు.

అప్పన్న కల్యాణం విజయవంతంపై అభినందనలు


ప్రజాశక్తి-సింహాచలం: ఆదివారం జరిగిన సింహాద్రి అప్పన్న వార్షిక కళ్యాణోత్సవం విజయవంతం కావడంతో ట్రస్టు బోర్డు సభ్యులు సోమవారం దేవస్థానం ఈవోను కలిసి అభినందనలు తెలియజేశారు. శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు ఈవోతో సమావేశమై ఈ నెల 23న జరిగే స్వామి వారి చందనోత్సవం విజయవంతం కావడానికి చేయవలసిన ఏర్పాట్లపై చర్చించారు. కొండపై ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా తీసుకోవాల్సిన చర్యలు, భక్తులకు నీడ కల్పించడం తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, దినేష్ రాజ్, దొడ్డి రమణ, సంపంగి శ్రీనివాసరావు, సువాడ శ్రీదేవి, రాజేశ్వరి, కోరాడ చందుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ల్యాండ్ పూలింగ్ భూములకు పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : పద్మనాభం మండలం కొవ్వాడ గ్రామ రైతుల వద్ద ల్యాండ్ పూలింగ్ ద్వారా జగనన్న కాలనీల కోసం తీసుకున్న భూములకు సంబంధించి పరిహారం తక్షణమే చెల్లించాలని మాజీ ఎంపిపి దంతులూరి గోపాలకృష్ణ రాజు డిమాండ్‌చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద బాధిత రైతులు నిరసన తెలిపారు. కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణరాజు మాట్లాడుతూ, భూములు సేకరించి రెండేళ్ల దాటినా పరిహారం ఇవ్వకపోగా అడిగిన వారిపై కేసులు పెడుతున్నారని ఆరోపించారు. పద్మనాభం మండలం గంధవరం, కొవ్వాడ, నర్సాపురం గ్రామాల్లో సుమారు 200 ఎకరాల సాగులో ఉన్న భూములను 100 మంది రైతుల నుంచి జగనన్న కాలనీల కోసం ప్రభుత్వం సేకరించిందన్నారు. ల్యాండ్‌పూలింగ్‌లో భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు 900 గజాలు ఇస్తామని హామీ ఇచ్చిన అధికారులు, రెండేళ్ళు దాటినా పరిహారం ఇవ్వలేదన్నారు. కొంతమందికి పట్టాలు ఇచ్చినప్పటికీ, స్థలాలు చూపలేదని తెలిపారు. ల్యాండ్ పూలింగ్‌కు భూములు ఇవ్వని కొంతమందికి పత్రాలతో పాటు స్థలాలను కూడా చూపించారని ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొవ్వాడ, గంధవరం, నర్సాపురం రైతులు పాల్గొన్నారు.

క్రెడాయ్ విశాఖ ఛైర్మన్‌గా కెఎస్ఆర్‌కె రాజు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : క్రెడాయ్ విశాఖ చాప్టర్ ఛైర్మన్‌గా కెఎస్ఆర్‌కె.రాజు (సాయి) ఎన్నికయ్యారు. 2023 -24 సంవత్సరానికి గానూ క్రెడాయ్ విశాఖపట్నం చాప్టర్ ఎన్నికలు సోమవారం కెఎస్ఆర్ ప్లాజాలో జరిగాయి. ఈ ఎన్నికలలో ఛైర్మన్‌గా కెఎస్ఆర్‌కె.రాజు, అధ్యక్షునిగా వి.ధర్మేందర్, ఉపాధ్యక్షునిగా ఇ.అశోక్‌కుమార్, కార్యదర్శిగా వి.శ్రీను, సంయుక్త కార్యదర్శులుగా కె.శ్రీనివాస్, పి.నరసింహారావు, కోశాధికారిగా కెవి.రాజు (రమేష్), కమిటీ సభ్యునిగా ఎం.కృష్ణమోహన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



క్రెడాయ్ విశాఖ చాప్టర్ నూతన పాలకవర్గ సభ్యులు

స్పందనకు 7 అర్జీలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు వివిధ సమస్యలపై 7 అర్జీలు అందాయి. పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి 2, ఇంజినీరింగ్ విభాగం-3, రెవెన్యూ, ప్రజారోగ్యం విభాగాలకు సంబంధించి చెరొక అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో యుసిడి ఎపిడి ఎల్.శ్రీనివాసరావు, టిపిఒ ఝాన్సీ, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాలపై ఫిర్యాదు

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని పాండ్రంగి పంచాయతీ పరిధి గోస్తనీ నది పరివాహక ప్రాంతంలో నిత్యం ఇసుక అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ఇసుక అక్రమ తవ్వకాలపై స్థానిక తహశీల్దార్ తోట శ్రీవల్లికి ఆ పంచాయతీ 1వ వార్డు మెంబర్ మహంతి అప్పలరమణ సోమవారం స్పందనలో ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన కొంతమంది నాటు బళ్లపై పగటి పూట గోస్తనీనది నుంచి అక్రమంగా ఇసుకను తెచ్చి నిల్వ చేసి రాత్రి సమయంలో లారీలకు అమ్ముకుంటున్నారని పేర్కొన్నారు.

92 శాతం ఆస్తి పన్ను వసూలు

ప్రజాశక్తి- భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ పరిధిలో పాత బకాయితో పాటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వసూలు చేయాల్సిన రూ.7.66 కోట్లకు గానూ రూ.7.13 కోట్లు వసూలైనట్లు (92 శాతం) జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము సోమవారం తెలిపారు. గతేడాది 67 శాతం మాత్రమే వసూలైనట్లు వెల్లడించారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్నను సోమవారం వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు దర్శించుకున్నారు. స్వామిని దర్శించిన వారిలో ఢిల్లీ హైకోర్టు చీఫ్ జస్టిస్ సతీష్ చంద్రశర్మ దంపతులు, విశాఖ జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున తదితరులు ఉన్నారు. వీరికి ఆలయ ఈవో వి.త్రినాధరావు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. వీరు ముందుగా కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేశారు. స్వామి అంతరాలయంలోనూ, గోదాదేవి సన్నిధిలోనూ, గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు ఆశీర్వదించారు. వారిని ఆలయ అధికారులు సాలువతో సత్కరించి, స్వామివారి ప్రసాదాన్ని, చిత్రపటాన్ని అందించారు.

ప్రశాంతంగా మొదటి రోజు 'పది' పరీక్షలు

27,855 మంది హాజరు, 132 మంది గైర్హాజరు

విశాఖ జిల్లాలో మొదటి రోజు పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షా కేంద్రాలను డిఇఒ, కలెక్టర్, అబ్జర్వర్, స్క్వాడ్ బృందాల సభ్యులు సందర్శించారు.

ప్రజాశక్తి -యంత్రాంగం

ఆరిలోవ : పదో తరగతి మొదటి రోజు తెలుగు పరీక్షకు విశాఖ జిల్లాలో 27,987 మంది హాజరు కావాల్సి ఉండగా 27,855 మంది హాజరయ్యారని, 132 మంది గైర్హాజరైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ తెలిపారు. జిల్లా అబ్జర్వర్ ఎం.జ్యోతికుమారి మూడు పరీక్షా కేంద్రాలను, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున రెండు కేంద్రాలను, స్క్వాడ్ బృందాలు 25 కేంద్రాలను, జిల్లా అధికారులు 6 కేంద్రాలను సందర్శించినట్లు పేర్కొన్నారు.

ఓపెన్ స్కూలు పరీక్షల్లో ఇద్దరు డిబార్

ఓపెన్ స్కూలు పది, ఇంటర్ పరీక్షలు కూడా సోమవారం ప్రశాంతంగా జరిగాయని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ తెలిపారు. మొదటి రోజు పదో తరగతి పరీక్షకు 827 మంది విద్యార్థులకు గానూ 756 మంది, ఇంటర్మీడియట్ పరీక్షకు 782 మందికి 709 మంది హాజరయ్యారని పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ మూడు పరీక్షా కేంద్రాలను, స్క్వాడ్ బృందాలు నాలుగు కేంద్రాలను సందర్శించినట్లు తెలిపారు. పెందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఒక విద్యార్థిని, మాధవధార జివియంసి ఉన్నత పాఠశాలలో ఒక విద్యార్థిని డిబార్ చేసినట్లు డిఇఒ తెలిపారు.

భీమునిపట్నం : జివిఎంసి భీమిలి మండల పరిధిలో ఏర్పాటు చేసిన 12 పరీక్షా కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు నిర్వహించారు.

పదో తరగతి పరీక్షలకు మండలంలో 8 మంది గైర్హాజరైనట్లు ఎంఇఒ కె.వి.బాలామణి తెలిపారు. మొత్తంగా 12 పరీక్షా కేంద్రాల్లో 2216 మందికి 2208 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు వివరించారు.


చిట్టివలస జెడ్పీ హైస్కూల్ వద్ద పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు

పద్మనాభం : మండలంలోని మద్ది, పద్మనాభం, రెడ్డిపల్లి, రేవిడి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల్లో 8 ప్రభుత్వ పాఠశాలలు, కస్తూరిబా పాఠశాలలు, 7 ప్రయివేటు పాఠశాలలకు చెందిన 763 మంది విద్యార్థులకు 757 మంది పరీక్షకు హాజరయ్యారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్దా రేవిడి పిహెచ్‌సి ఆధ్వర్యాన వైద్యశిబిరం ఏర్పాటుచేశారు. పరీక్షా కేంద్రాలను ఎంఇఒ శివరాణి, తహశీల్దార్ తోట శ్రీవల్లి పర్యవేక్షించారు.

ఓపెన్ స్కూల్ పరీక్షకు 144 మంది హాజరు

పద్మనాభం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం మధ్యాహ్నం ఓపెన్ స్కూల్ పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 వరకు పరీక్ష జరిగింది. ఈ కేంద్రంలో 160 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 144 మంది హాజరైనట్లు ఎంఇఒ శివరాణి తెలిపారు.

అకాల వర్షం, గాలితో పంట నష్టం


నేలకొరిగిన మొక్కజొన్న పంట

ప్రజాశక్తి-పద్మనాభం : అకాల వర్షం, గాలి వల్ల చోడి, మొక్కజొన్న పంటలు నేలకొరిగి రైతులకు నష్టం కలిగింది. ఖరీఫ్ పంట తరువాత రబీ సాగులో భాగంగా చోడి, మొక్కజొన్న పంటలను రైతులు ఎక్కువగా వేశారు. ఈ ఏడాది అవి ఏపుగా పెరిగాయి. పంట కోతకు సిద్ధంగా ఉన్న సమయంలో అకాల వర్షం, దానికి తోడు పెద్ద గాలులు వీయడంతో పంట నేలకొరిగింది. చేతికొచ్చిన పంట పోవడంతో రైతులు దిగులు చెందుతున్నారు. మండలంలోని విలాస్‌ఖాన్‌పాలెం, మద్ది, అనంతవరం, పద్మనాభం, కృష్ణాపురం, రెడ్డిపల్లి, కోరాడ, గెద్దపేట గ్రామాల్లో ఈ పంటలకు పూర్తిగా నష్టం జరిగింది. ప్రభుత్వ అధికారులు పరిశీలించి నష్టపరిహారం అందించేందుకు తగు ఏర్పాట్లు చేయాలని రైతులు కోరుతున్నారు.

సుబ్బారావు కుటుంబానికి పరామర్శ


సుబ్బారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కృష్ణమూర్తి

ప్రజాశక్తి -గాజువాక : సిపిఎం సీనియర్ నాయకులు జి.సుబ్బారావు మృతిచెందడంతో శీలానగర్‌లోని ఆయన కుటుంబాన్ని సిపిఎం విజయనగరం జిల్లా పూర్వ కార్యదర్శి బి.కృష్ణమూర్తి సోమవారం పరామర్శించారు. సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నమ్మిన సిద్ధాంతం కోసం సుబ్బారావు చివరి వరకు పోరాడారన్నారు. నిత్యం ప్రజల కోసం పాటుపడ్డారని తెలిపారు. పరామర్శించిన వారిలో కృష్ణమూర్తి సతీమణి కుమారి, వార్డు నాయకులు దాసరి అప్పారావు, గణేష్ ఉన్నారు.

లింకులు తెగిన గూడ్స్

ప్రజాశక్తి-పెందుర్తి : విశాఖ నుంచి కిరండల్ వైపు వెళ్తున్న గూడ్స్ పెందుర్తి వద్దకు వచ్చేసరికి ఐదు వేగన్లు లింకులు తప్పాయి. ఒక్కో వ్యాగన్ ఒక్కో దగ్గర ఆగిపోయాయి. సమాచారం తెలుసుకున్న సిఆర్‌పి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. పెందుర్తి దగ్గరలో జరగడంతో స్థానికులు అధిక సంఖ్యలో గుమిగూడారు.

అనారోగ్యంతో వీరఘట్టం నారాయణరావు మృతి

ప్రజాశక్తి-సీతమ్మధార : అధ్యాపకునిగా, గాయకునిగా సేవలందించిన వీరఘట్టం నారాయణరావు (70) అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయనకు భార్య సుశీల, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. గత ఎనిమిది నెలలుగా అనారోగ్యంతో బెంగుళూరులోని చక్ర హాస్పిటల్లో చికిత్స పొందుతూ శనివారం తుది శ్వాస విడిచారు. విజయనగరం జిల్లా బొబ్బిలిలో 1953లో జన్మించిన వి.నారాయణరావు ఆంధ్ర విశ్వ విద్యాలయంలో ట్రిబుల్ ఎంఎ చేశారు. అనకాపల్లి, నర్సీపట్నం, చోడవరం, అరకు, విశాఖపట్నం ప్రభుత్వ మహిళా కళాశాలల్లో అధ్యాపకునిగా పనిచేశారు. అనేక రాష్ట్రాల్లో జరిగిన పాటల పోటీల్లో పాల్గొని ఘంటసాల పాటలు పాడుతూ బంగారు పతకాలతో పాటు ఎన్నో బహుమతులు సాధించారు. వైశాఖి ఎంటర్‌టైనర్స్ సాంస్కృతిక సంస్థను స్థాపించి విశాఖలో పలు వేదికలపై లెక్కకు మించి పాటల ప్రదర్శనలు ఇచ్చారు. కుమారుల ఉద్యోగ రీత్యా ఎనిమిదేళ్ల క్రితం బెంగుళూరులో స్థిరపడిన నారాయణరావు ఎనిమిది నెలల కిందట బాత్ రూమ్‌లో జారి పడి అనారోగ్యానికి గురయ్యారు. అప్పటి నుంచి చక్ర హాస్పిటల్లో చికిత్స పొందుతూ శనివారం తుది శ్వాస విడిచారు. సోమవారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన మృతి పట్ల విశాఖ సంగీత కళాకారుల సంక్షేమ సంఘం ప్రతినిధులు కొణతాల రాజు, మహ్మద్ ఖాన్, మెలోడీ సత్యనారాయణ, ఎస్ఎస్ఎన్ రాజు, ఎంవిఆర్ నాగేశ్వరరావు, చెన్నా తిరుమలరావు తదితరులు సంతాపం తెలిపారు.

పోస్టల్ మేళా

ప్రజాశక్తి-సీతమ్మధార : అక్కయ్యపాలెం సబ్ పోస్ట్ ఆఫీస్ ఆధ్వర్యాన సీతంపేట దుర్గాగణపతి ఆలయం వద్ద మెగా పోస్టల్ మేళా నిర్వహించారు. స్థానిక వార్డు కార్పొరేటర్ సారిపల్లి గోవింద ఈ మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తపాలా శాఖ అనేక రకాల పొదుపు పథకాలను అందజేస్తుందన్నారు. ఆర్‌డి డిపాజిట్లు, లైఫ్ ఇన్సూరెన్స్, సుకన్య సమృద్ధ పథకాల్లో ప్రజలు పొదుపు చేసి అధిక లాభాలు పొందవచ్చని వివరించారు. పోస్ట్ మాస్టారు ఏసు మాట్లాడుతూ, పోస్ట్ ఆఫీస్‌లో గానీ, మీ ఇంటికి ఉత్తరాలు బట్వాడ చేసే పోస్ట్‌మ్యాన్ ద్వారా గానీ డబ్బులు డిపాజిట్ చేయవచ్చని తెలిపారు. పోస్టల్ శాఖ అందజేస్తున్న పలు పొదుపు పథకాలు, వాటి ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమాన్ని వెస్ట్ సబ్ డివిజన్‌లో ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ పర్యవేక్షించారు. అక్కయ్యపాలెం సబ్ పోస్ట్ ఆఫీస్ సిబ్బంది, పోస్ట్‌మ్యాన్లు పాల్గొన్నారు.

విశాఖ ఇంజినీరింగ్ కళాశాలలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి -గోపాలపట్నం : సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ జన్మదినాన్ని పురస్కరించుకొని విశాఖ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం రోటరీ క్లబ్ ఆధ్వర్యాన రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 100 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. కళాశాల ఛైర్మన్ జి.సత్యనారాయణ మాట్లాడుతూ, లక్ష్మీనారాయణ జన్మదినాన్ని పురస్కరించుకొని విద్యార్థులు రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శ్రీధర్ పట్నాయక్, సిహెచ్ వీరునాయుడు పాల్గొన్నారు

రేక్‌ల నిర్వహణలో గంగవరం పోర్టు రికార్డు

ప్రజాశక్తి -గాజువాక : అదాని గంగవరం ఓడరేవు 663 రేక్‌లను నిర్వహించడంలో సరికొత్త రికార్డును నెలకొల్పినట్లు పోర్టు యాజమాన్యం ప్రతినిధి తెలిపారు. 2023 మార్చి 31న రేక్‌ల నిర్వహణలో గతంలోని 6 రికార్డులను అధిగమించిందని పేర్కొన్నారు. పోర్టులో విస్తారమైన నిల్వ సౌకర్యాలు ఉన్నాయని, వివిధ కార్గోలు, స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ మెటీరియల్ హ్యాండ్లింగ్ సిస్టమ్‌లను నిర్వహించడానికి కవర్ చేసిన గిడ్డంగులతో సహ అదానీ గంగవరం పోర్టు నిలకడగా మంచి పనితీరును కనబరుస్తోందని తెలిపారు. వివిధ రకాల కార్గోలను హ్యాండిల్ చేయడంలో కొత్త రికార్డులను సృష్టిస్తోందని పేర్కొన్నారు.

పోర్ట్ ఒక రోజులో అత్యధికంగా 22 లోడ్ చేసిన అవుట్‌వర్డ్ రేక్‌లను సాధించిందని తెలిపారు. ఒక నెలలో అత్యధికంగా 663 రేక్‌లను నిర్వహించినట్లు పేర్కొన్నారు. రేక్‌లను నిర్వహించడంలో మునుపటి ఆరు రికార్డులను అధిగమించినట్లు తెలిపారు. గంగవరం పోర్టు ద్వారా వినియోగదారులకు ఉత్తమమైన సేవలను అందించడానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.

గ్రంథాలయాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి- ములగాడ : మహిళలు తీరిక సమయాల్లో గ్రంథాలయాలకు వెళ్లాలని, తద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్ పర్సన్ కొండా రమాదేవి సూచించారు. మల్కాపురంలోని పల్లివీధిలో ఏర్పాటు చేసిన "బుక్ డిపాజిట్ సెంటర్" (బిడిసి)ను ఆమె ప్రారంభించారు. స్థానిక మహిళా నాయకులు రేవు జగదాంబ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రమాదేవి మాట్లాడుతూ, స్థానిక మహిళలు ఏర్పాటు చేసుకున్న ఈ బుక్ డిపాజిట్ సెంటర్‌ను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. పుస్తకాలు చదవడం ద్వారా సమాజం, వ్యక్తుల పట్ల అవగాహన ఏర్పడుతుందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడానికి పుస్తకాల అధ్యయనం ఎంతో అవసరం అని చెప్పారు. గౌరవ అతిథి, 61వ వార్డు వైసిపి అధ్యక్షులు డిపో సత్యనారాయణ మాట్లాడుతూ, బుక్ డిపాజిట్ సెంటర్ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. అవసరమైన పుస్తకాలను అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్కాపురం ప్రకాష్‌నగర్‌లోని శాఖాగ్రంథాలయాధికారి అజయ్‌కుమార్, ప్రముఖ న్యాయవాది జికెవి.రాజు, ప్రముఖ కార్మిక నాయకులు బి.సత్యానందం, జిల్లా జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి, స్థానిక మహిళా సంఘాల రిసోర్స్‌పర్సన్ నిర్మల, బుక్ సెంటర్ గ్రంథాలయాధికారి రాఘవ, స్థానిక మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ అధ్యయన కేంద్ర అభివృద్ధికి అన్ని విధాల సహకరిస్తానని చెప్పిన కార్పొరేటర్ కొణతాల సుధకు మహిళలంతా కృతజ్ఞతలు తెలిపారు.

కులమతాలకతీతంగా సేవలు : పీవీ.సురేష్

ప్రజాశక్తి -ములగాడ : కుల, మతాలకతీతంగా సేవలందిస్తున్నానని, తన ఎదుగుదలను చూసి ఓర్వలేక కొంతమంది స్వార్థ రాజకీయ నాయకులు తనను దళిత వ్యతిరేకిగా ముద్ర వేసి అసత్య ప్రచారాలు చేస్తున్నారని 60వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ పీవీ సురేష్ పేర్కొన్నారు. శ్రీహరిపురంలోని మహాత్మాగాంధీ వాణిజ్య సముదాయం సమీపంలో సోమవారం సాయంత్రం జరిగిన ఒక కార్యక్రమంలో బిఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాను సేవ చేసేందుకే రాజకీయంలోకి వచ్చానన్నారు. చింతచెట్టు క్రింద బ్యాగులు కుట్టే రాజు దుకాణం తొలగింపులో తన ప్రమేయం ఉందని కొంతమంది నిరాధారణమైన ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఈ విషయంలో తనకు ఎటువంటి సంబంధమూ లేదన్నారు. సుమారు 150 మంది దళితులు పీవీ.సురేష్‌కు మద్దతుగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పీవీ సురేష్

ఘనంగా ఇగ్నో 36వ స్నాతకోత్సవం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) 36వ స్నాతకోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. విశాఖపట్నం ఇగ్నో ప్రాంతీయ కేంద్రం పరిధిలో స్థానిక విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన ప్రాంతీయ స్నాతకోత్సవ కార్యక్రమానికి విజయనగరంలోని ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయ ఉప కులపతి ఆచార్య టివి.కట్టిమణి గౌరవ అతిథిగా విచ్చేసి విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందించారు. ఈ సందర్భంగా ఆచార్య కట్టిమణి మాట్లాడుతూ, దూరవిద్య ద్వారా ఉత్తమ విద్యనందించేందుకు అన్ని వనరులు ఉన్న విశ్వ విద్యాలయం ఇగ్నో అని తెలిపారు. రోజురోజుకూ మారుతోన్న నైపుణ్యాలను ఒడిసిపట్టి నిరంతరం వాటిని మెరుగుపరుచుకుంటేనే సరైన ఉపాధిని పొందగలుగుతారని ఉద్బోధించారు. ప్రాంతీయ కేంద్ర సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు వార్షిక నివేదికను వివరించారు. ఈ ప్రాంతీయ కేంద్రం పరిధిలోని గ్రామీణ అధ్యయన కేంద్రాలలో విద్యార్థుల అడ్మిషన్లు పెంచడానికి, నిరుద్యోగ గ్రామీణ యువతకు నైపుణ్యాభివృద్ధి కోర్సులు ప్రారంభించడానికి కృషి చేసినట్లు తెలిపారు. వివిధ కొత్త కోర్సులను విశాఖపట్నం ప్రాంత విద్యార్థులకు కూడా అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. ఇగ్నో అధ్యయన కేంద్రాలు లేనిచోట కొత్త అధ్యయన కేంద్రాల ఏర్పాటుకు ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇగ్నో పూర్వ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ ఎస్.రాజారావు, విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్, ప్రాంతీయ సంయుక్త సంచాలకులు డాక్టర్ ఎస్.శోభారాణి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ లక్ష్మీపతిరావు, ఇగ్నో అధ్యయన కేంద్ర సమన్వయకర్తలు, సహ సమన్వయకర్తలు, ఇగ్నో ఉద్యోగులు పాల్గొన్నారు.

పెరిగిన అమూల్ పాల ధరలు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : పక్షం రోజుల క్రితం విశాఖ డెయిరీ పాల ధరలు పెరిగాయి. ఇప్పుడు అమూల్ పాల ధర కూడా మళ్లీ పెరిగింది. అమూల్ మార్కెటర్ గుజరాత్ కో- ఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ లిమిటెడ్ పాల ధరలలో లీటరుకు రూ.2 చొప్పున పెంచింది. ఈ పెంచిన ధరలు వెంటనే అమల్లోకి వచ్చినట్లు సంస్థ ప్రకటించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో గుజరాత్ మినహా దేశం అంతటా లీటరుకు రూ.3 పెంచింది. ప్రస్తుతం అమూల్ గోల్డ్, అమూల్ తాజా, అమూల్ ఆవు, అమూల్ గేదె పాలకు ఈ పెరిగిన ధర వర్తిస్తుంది. పెంపు తర్వాత ఫుల్ క్రీమ్ అమూల్ గోల్డ్ ధర లీటరుకు రూ.64, అమూల్ శక్తి రూ.58, అమూల్ తాజా లీటరుకు రూ.52, అమూల్ టీ స్పెషల్ రూ.58 నుంచి రూ.60గా ఉన్నాయి.

సేవలే గుర్తింపునిస్తాయి

ప్రజాశక్తి -గాజువాక : వృత్తిలో చేసిన సేవలు ఉద్యోగ విరమణ అనంతరం కూడా గుర్తింపునిస్తాయని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు అన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారంలో నాలుగు దశాబ్దాలుగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ చేసిన ఏఐటియుసి నాయకులు పల్లేటి పోలయ్యను పెదగంట్యాడలోని పోతిన సన్యాసిరావు భవన్‌లో సోమవారం సత్కరించారు. ఈ కార్యక్రమానికి ఎం.పైడిరాజు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పల్లేటి పోలయ్య ఇటు కమ్యూనిస్ట్ పార్టీలో, అటు ఏఐటియుసిలో కీలక నేతగా పనిచేసి అందరి మన్ననలు పొందారని కొనియాడారు. భవిష్యత్తులో పోలయ్య సిపిఐ అభివృద్ధికి మరింత కృషి చేయాలని పిలుపు నిచ్చారు. సిపిఐ గాజువాక నియోజకవర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ, విశాఖ ఉక్కులో యూనియన్ బలోపేతానికి పల్లేటి పోలయ్య ఎనలేని కృషి చేశారన్నారు. ఎల్లేటి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు తాండ్ర కనకరాజు, జి.ఆనంద్, కె.పోతయ్య, ఆప్పారి విష్ణుమూర్తి, కె.అచ్యుతరావు, అప్పారావు, మాధవరావు, ఎస్.సత్తయ్య, కె.సోమేష్, కె.వనజాక్షి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి-సీతమ్మధార : జీవీఎంసీ 25వ వార్డు పరిధి సీతంపేట రాజేంద్రనగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో రోటరీ బ్లడ్ బ్యాంక్, శంకర్ ఐ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యాన మెగా నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని స్థానిక వార్డు కార్పొరేటర్ సారిపల్లి గోవింద్ ప్రారంభించారు. ఆ పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ డివిజన్ అధ్యక్షుడు నారాయణ, రాష్ట్ర రోటరీ క్లబ్, బ్లడ్ బ్యాంక్ ఛైర్మన్ జిఎస్.రాజు తదితరులు పాల్గొన్నారు.

చిట్టిబాబు కాలనీలో..

తాటిచెట్లపాలెం చిట్టిబాబు కాలనీలో సోమవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. రోటరీ క్లబ్ అధ్యక్షులు మధు ప్రారంభించిన శిబిరంలో పలు టెస్ట్‌లు ఉచితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజు మాట్లాడుతూ, పేదలకు వైద్యం అందుబాటులో లేదన్నారు. మురికివాడల్లో రోగాల పట్ల అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. రోటరీ క్లబ్, శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించామని తెలిపారు. 150 మందికి తనిఖీ చేసి, 29 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించినట్లు తెలిపారు. వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ ప్రతినిధి అంబికా, విసిసి కో-ఆర్డినేటర్ రమ, గౌరీష్, జ్యోతి, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సంతోష్, శ్రావణ్, శివ, భరత్, చిట్టిబాబు కాలనీ రామచంద్ర నగర్, శివ శంకర రజక కాలనీ, సంతోష్ మాత కాలనీ, వైఎస్సార్ కాలనీ, ఎస్ఆర్ నగర్ ప్రజలు పాల్గొన్నారు.

సౌత్ ఇండియన్ అలయన్స్ కౌన్సిల్ సభ్యునిగా నరవ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విద్య ప్రాథమిక హక్కుకోసం సౌత్ ఇండియన్ అలయన్స్ సంస్థ సమావేశం ఏప్రిల్ 2, 3 తేదీలలో బెంగళూరులో నిర్వహించారు. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ నుంచి నరవ ప్రకాశరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సౌత్ ఇండియన్ అలయన్స్ కౌన్సిల్ సభ్యులుగా నరవ ప్రకాశరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ పదవిలో ఆయన మూడేళ్లు కొనసాగుతారు. ఆచార్య నిరంజన్ ఉపాధ్యాయ నరవ ప్రకాశరావుకు నియామక పత్రాలు అందజేశారు.

పదో తరగతి పరీక్షలు ప్రారంభం

99 శాతం మంది హాజరు



సబ్బవరంలో పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి

ప్రజాశక్తి -అనకాపల్లి

జిల్లాలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలకు 99.36 శాతం విద్యార్థులు హాజరయ్యారు. జిల్లావ్యాప్తంగా 111 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. రెగ్యులర్ విద్యార్థులు 22,293 మంది, ప్రైవేటు విద్యార్థులు 241 మంది పరీక్షకు హాజరు కావలసి ఉండగా, వీరిలో రెగ్యులర్ విద్యార్థులు 22,182 మంది, ప్రైవేటు విద్యార్థులు 207 మంది హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి, డీఈవో వెంకటలక్ష్మమ్మ, జిల్లా పరిశీలకులు పర్యవేక్షించారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వహించామని డీఈవో వెంకట లక్ష్మమ్మ తెలిపారు.

బుచ్చెయ్యపేట : మండలంలోని వడ్డాది, దిబ్బిడి హైస్కూళ్ల జరిగి పదో తరగతి పరీక్షలకు 586 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేశామని ఎంఈఓ చంద్రశేఖర్ తెలిపారు.

సబ్బవరం : మండలంలోని పదోతరగతి పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ రవి పఠాన్ శెట్టి పరిశీలించారు. స్థానిక ప్రతిభా విద్యాలయం, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. మండలంలోని 1016 విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా, 1008 మంది హాజరు కాగా, 8 మంది గైర్హాజరు అయినట్లు ఎంఈఒ ఎస్. అప్పలరాజు తెలిపారు.

కశింకోట : కశింకోట మండలంలో ఏడు కేంద్రాల్లో పదవ తరగతి పరీక్షలకు 1181 మంది విద్యార్థులు హాజరయ్యారు. 9 మంది గైర్హాజరయ్యారు.

కె.కోటపాడు : మండలంలోని ఎనిమిది జిల్లా పరిషత్ హైస్కూళ్లు ఉండగా కె.కోటపాడులో రెండు, ఏ.కోడూరులో ఒకటి పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 528 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా ఐదుగురు విద్యార్థులు హాజరు కాలేదని ఎంఈఓ మధుమూర్తి తెలిపారు.

చోడవరం : మండలంలో 1217 మంది గాను1212 విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఐదుగురు గైర్హాజరయ్యారు. మండలంలో ఆరు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు.

నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం మండలంలోని తొమ్మిది పరీక్ష కేంద్రాలలో 2079 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా, 2069 మంది పరీక్షకు హాజరయ్యారని, 10 మంది తెలుగు గైర్హాజరైనట్లు మండల విద్యాశాఖ అధికారి సాయిశైలజ తెలిపారు. గట్టి పోలీసు బందోబస్తుకు తోడు పరీక్ష కేంద్రాల్లో సిసి కెమెరాల నిఘా ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాలలో తాగునీరు, అత్యవసర సేవలు ఏర్పాటు చేశారు.

కోటవురట్ల : మండలంలో ప్రభుత్వ పాఠశాల, బాలికల జిల్లా పరిషత్ బాలికల పాఠశాల పరీక్ష కేంద్రాల్లో 400 మంది విద్యార్థులు పది పరీక్షలు రాశారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

ఎస్. రాయవరం: మండలంలోని సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించిన దార్లపూడి, ధర్మవరం పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు. విద్యార్థులను ముందుగానే తనిఖీలు చేసిన తర్వాత పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. మొత్తం ఐదు పరీక్ష కేంద్రాలలో 1151మంది విద్యార్థులకు గాను 1142మంది హాజరైనట్టుగా ఎంఇఒ మూర్తి తెలిపారు.

నక్కపల్లి : మండలంలోని నక్కపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, గురుకుల పాఠశాల, గురూస్ స్కూల్ ,వేంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ,గొడిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐదు పదో తరగతి పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు .పరీక్షా కేంద్రాలను ఉప విద్యాశాఖ అధికారి ప్రేమ్ కుమార్, ఎంపిడిఒ సీతారామరాజు, తహశీల్దార్ నీరజ, ఎంఇఒ డివిడి ప్రసాద్ పర్యవేక్షించారు.

గొలుగొండ : మండలంలో గురుకుల కళాశాల, చీడిగుమ్మల, ఏఎల్‌పురం జిల్లా పరిషత్ హైస్కూల్ మూడు పరీక్షా కేంద్రాల్లో 579 మంది విద్యార్థులకు 577 మంది పరీక్షలకు హాజరైనట్లు ఎంఇఒ సత్యనారాయణ తెలిపారు. మాస్‌కాపీయింగ్ జరగకుండా గొలుగొండ, కేడిపేట ఎస్‌ఐలు నారాయణరావు, సూర్యనారాయణ బందోబస్తు ఏర్పాటు చేశారు.



నక్కపల్లిలో పరీక్షకు హాజరైన విద్యార్థులు



పరీక్ష రాసి ఆనందంగా తిరిగి వస్తున్న విద్యార్థులు



విద్యార్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు



కలెక్టరేట్ ముందు ఆందోళన చేస్తున్న సిపిఎం, టిడిపి నాయకులు

రోడ్డు మరమ్మతు చేపట్టాలని ఆందోళన

ప్రజాశక్తి-మునగపాక రూరల్ : అనకాపల్లి- అచ్యుతాపురం రోడ్డు మరమ్మతులు చేపట్టి ప్రమాదాలను నివారించాలని సిపిఎం, టిడిపి నాయకులు సోమవారం అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేసి,స్పందనలో జెసి కల్పనా కుమార్‌కి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మహేష్, టిడిపి నాయకులు దొడ్డి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ రోడ్డు గుంతల మయమై అస్తవ్యస్తంగా మారినప్పటికీ ప్రభుత్వ యంత్రాంగం దృష్టి సారించకపోవడం శోచనీయమన్నారు. అనేక ప్రమాదాలకు నిలయంగా మారటమే కాకుండా మృత్యుకుహారంగా మారిందన్నారు. తక్షణమే రోడ్డు మరమ్మతులు చేపట్టి ప్రమాదాలను అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దాడి ముసలి నాయుడు, ముల్లేటి సత్యనారాయణ, యోగి నాగేశ్వరరావు, ఆడారి జనార్ధన్, ఆడారి లక్ష్మణరావు, వెలగా మురళి ఉల్లింగల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే ధర్మశ్రీ, బార్ అసోసియేషన్ నేతలు

కోర్టు భవనాలకు నిధులివ్వాలని వినతి

ప్రజాశక్తి-చోడవరం : నిర్మాణం చేపట్టి నిలిచిపోయిన చోడవరం కోర్టు సముదాయాల భవనాలకు నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని చోడవరం బార్ అసోసియేషన్ అధ్యక్షులు కాండ్రేగుల డేవిడ్ స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీతో కలిసి ఆర్ అండ్ బి చీఫ్ ఇంజనీర్ మాధవి సుకన్యకు అమరావతిలో సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధర్మశ్రీ మాట్లాడుతూ మాట్లాడుతూ కోర్టు భవన సముదాయాలకు 15 కోట్ల రూపాయలు గతంలో కేటాయించారని, సుమారు 70 లక్షల రూపాయలు పనులు కూడా జరిగాయని తెలిపారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వలన నిధులు వెనక్కి మళ్లాయని, త్వరగా నిధులు మంజూరు చేయాలని కోరారు.

గంప శ్రీదేవికి మహానంది అవార్డు

ప్రజాశక్తి-అనకాపల్లి : విజయవాడలో ఏఎన్ఎస్ 24 టీవీ ఉగాది మహానంది పురస్కారాల సందర్భంగా అనకాపల్లి సాహితీ సభ్యురాలు, జేఎంజె పాఠశాల ఉపాధ్యాయిని, కవయిత్రి, శతక కర్త గంప శ్రీదేవికి మహానంది అవార్డు అందజేశారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో పాటు, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి సుమారు 65 మంది పురస్కార గ్రహీతల్లో శ్రీదేవి ఒకరు కావడం హర్షనీయమని అనకాపల్లి సాహితీ మిత్రులు అభినందించారు. విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బండి పుణ్యశీల, ఏ ఎన్ ఎస్ 24 టీవీ సీఈవో అశోక్ కుమార్, ఎండి అనుమండ్ల నాగరాజు, కోఆర్డినేటర్ వనపర్తి పద్మావతి చేతుల మీదుగా అవార్డును అందుకున్నట్టు పురస్కార గ్రహీత శ్రీదేవి తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను అనకాపల్లి సాహితీ మిత్రులతో పాటు పాఠశాల సిబ్బంది అభినందించారు.



శ్రీదేవికి మహానంది అవార్డును అందజేస్తున్న దృశ్యం

తాగునీటి బోరు పనులు ప్రారంభం

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : గ్రామాలలో తాగునీటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని, వైసిపి మండల పార్టీ అధ్యక్షులు కొల్లిమల్ల అచ్చం నాయుడు తెలిపారు. సోమవారం మండలంలోని సీతయ్యపేట బొబ్బిలి వారి వీధిలో నూతనంగా తాగునీట బోరు ఏర్పాటు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తాగునీటి సౌకర్యాలు కల్పనకు కషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దాకారపు నాగేశ్వరి దేవి, సీనియర్ నాయకుల కోరుకొండ అప్పలనాయుడు, పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఆసరాతో మహిళల అభివృద్ధి

ప్రజాశక్తి-కశింకోట : వైసిపి ప్రభుత్వం అందిస్తున్న ఆసరా నిధులతో మహిళలు అభివృద్ధి చెందుతున్నారని ఎంపిపి కలగా లక్ష్మి అన్నారు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 5 వైయస్సార్ మూడు విడత ఆసరా పంపిణీపై సచివాలయం సిబ్బందితో సమీక్ష సమావేశం సోమవారం నిర్వహించారు. మండలంలో 16,500 మందికి రూ.39,81 కోట్లు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్ పి డి ఓ కొంకి అప్పారావు, ఏరియా కోఆర్డినేటర్ ధర్మారావు, ఎపిఎమ్ ఎమ్ శ్రీనివాసరావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు అరుణ, గ్రామ కార్యదర్శులు రమేష్, సత్యారావు, వైసిపి నాయకులు శ్రీనివాసరావు పాల్గొన్నారు



మాట్లాడుతున్న ఎంపిపి కలగా లక్ష్మి

ఆర్‌సిఎల్ పరిశ్రమలో కార్మికుడు మృతి

రూ.కోటి పరిహారం చెల్లించాలని ఆందోళన



పరిశ్రమ వద్ద రోడ్డుపై ఆందోళన చేస్తున్న కార్మికులు, మృతుని బంధువులు

ప్రజాశక్తి -అచ్యుతాపురం

అచ్యుతాపురం ఎస్ఇజెడ్‌లోని ఆర్‌సిఎల్ పరిశ్రమలో సోమవారం జరిగిన ప్రమాదంలో పూడిమడక గ్రామానికి చెందిన కొవిరి పెంటయ్య మృతి చెందాడు. పెంటయ్య సంవత్సర కాలంగా పరిశ్రమలో పనిచేస్తున్నాడు. సోమవారం ప్రమాదవశాత్తు క్రేన్ ఢీకొట్టడంతో అయన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని కుటుంబానికి కోటి రూపాయలు పరిహారం ఇవ్వాలని ఈ సందర్భంగా ఆర్‌సిఎల్ పరిశ్రమ ప్రధాన గేటు ఆవరణలో మత్స్యకారులు, సిఐటియు నాయకులు బైఠాయించారు. అనంతరం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము మాట్లాడుతూ పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా ప్రమాదం చోటు చేసుకుందన్నారు. న్యాయం జరిగేంత వరకు పోరాడతామని తెలిపారు. ఈ ఆందోళన కార్యక్రమంలో మత్స్యకార మత్స్యకార సంఘం ప్రతినిధులు, మత్స్యకారులు పాల్గొన్నారు. పరిశ్రమ వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు ముందస్తుగా బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉపాధి హామీ ఆడిట్ సమావేశం

ప్రజాశక్తి-మునగపాక రూరల్ : మండలంలోని వాడ్రాపల్లి గ్రామంలో సోమవారం ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఆడిట్ సమావేశం స్థానిక సచివాలయంలో జరిగింది. ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో ఎరకయ్య ఉపాధి హామీ కూలీల పనితీరు, గడిచిన రెండు సంవత్సరాలు కాలంలో ఖర్చులు, డెవలప్మెంట్ తదితర అంశాలను చర్చించారు. ఈ సమావేశంలో పాల్గొన్న సర్పంచ్ నూకరాజు మాట్లాడుతూ జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్క కుటుంబం ఉపాధి హామీ ద్వారా లబ్ధి పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని జోష్నా కుమారి, సచివాలయ కార్యదర్శి శ్రీదేవి, ఉపాధి హామీ కార్మికులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, డ్వాక్రా మహిళలు మరియు అంగన్వాడీ, ఆశాలు పాల్గొన్నారు.



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

వడ్డాదిలో వైఎస్ఆర్ కంటి వెలుగు పరీక్షలు

ప్రజాశక్తి- వడ్డాది : వైఎస్ఆర్ కంటి వెలుగుతో జీవితం మరింత సుఖమయం అవుతుందని వైస్ ఎంపిపి దొండా లలిత నారాయణ మూర్తి తెలిపారు. బుచ్చయ్యపేట మండలం వడ్డాది సచివాలయం 1, 2లో సోమవారం వైఎస్ఆర్ కంటి వెలుగు పరీక్షలు నిర్వహించారు. కంటి వైద్యులు డాక్టర్ ఆర్ వెంకట్రావు ఆధ్వర్యంలో 776 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో 22మందికి ఆపరేషన్ చేస్తామని, 221 మందికి కళ్లద్దాలు పంపిణీ చేస్తామని తెలిపారు. మిగిలిన వారికి మందులు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లోవ రాజు, వైద్యాధికారి ఆర్ మౌనిక, సిబ్బంది కనక లక్ష్మీ, విజయ లక్ష్మి, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తరలింపు తగదు

ప్రజాశక్తి- అనకాపల్లి : ప్రజలకు అందుబాటులో పట్టణ నడిబొడ్డులో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని గ్రామీణ ప్రాంతానికి తరలించడం తగదని తెలుగుదేశం పార్టీ అనకాపల్లి పార్లమెంటరీ కమిటీ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో సోమవారం వినతి పత్రం అందజేసింది. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ కేవలం కాసులకు కక్కుర్తి పడి ప్రజలకు అందుబాటులో ఉన్న కార్యాలయాన్ని అర్ధాంతరంగా తరలించడం శోచనీయమన్నారు. శిథిలావస్థలో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సొంత భవనానికి తెలుగుదేశం ప్రభుత్వం మూడున్నర కోట్ల రూపాయలు మంజూరు చేసిందని, అనంతరం వచ్చిన వైసిపి ప్రభుత్వం కార్యాలయ నిర్మాణం చేపట్టకపోగా ఆ నిధులను దారి మళ్లించిందని పేర్కొన్నారు. జిల్లా మంత్రిగా గుడివాడ అమర్నాథ్ తాసిల్దార్ కార్యాలయం, సబ్ రిజిస్ట్రర్ కార్యాలయం, కోర్టు భవనం పునర్నిర్మాణం చేయలేకపోయారని, ఆయన మాటలు కోటలు దాటితే చేతలు గడప దాటలేదని విమర్శించారు. తక్షణమే సబ్ రిజిస్ట్రార్, కోర్టు, తాసిల్దార్ కార్యాలయాల నిర్మాణం చేపట్టకపోతే పెద్ద ఎత్తున టిడిపి ఆందోళన చేస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కోట్ని రామకృష్ణ, సూరే సతీష్, మల్ల గణేష్, బుద్ధ భువనేశ్వర్ రావ్, సాలాపు నాయుడు, కోట్ని రాంబాబు, కేబుల్ రమేష్, షేక్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

పంటల సస్యరక్షణపై అవగాహన

ప్రజాశక్తి- కె.కోటపాడు : కీటకాలు నుండి పంటలను రక్షించడంపై శ్రీకాకుళం జిల్లా నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థులు రైతులకు అవగాహన కల్పించారు. సోమవారం సింగన్న దొరపాలెం రైతులతో మాట్లాడుతూ రసం పీల్చే పురుగులు ఉధృతిని తగ్గించేందుకు ప్రతి పంట పొలంలోనూ పసుపు జిగురు అట్టలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ పురుగులు ఎక్కువగా బెండ, తీగజాతి కూరగాయలు, వేరుశనగ, వరి పంటపై దాడి చేస్తాయన్నారు. ఎకరాకు నాలుగు చొప్పున పసుపు జిగురు అట్టలను పెట్టడం వలన తెల్ల దోమతో పాటు హాని కలిగించే కీటకాల నుండి పంటలను రక్షించుకోవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పుష్ప మంజరి ,ఉమా, స్నేహలత, తేజస్విని, పలువురు రైతులు పాల్గొన్నారు.

మార్గదర్శిపై ప్రభుత్వ కక్షసాధింపు సరికాదు

ప్రజాశక్తి-కె.కోటపాడు : మార్గదర్శి చిట్ ఫండ్స్ విషయంలో వైసిపి ప్రభుత్వం కక్షపూరిత ధోరణితో వ్యవహరిస్తున్నదని మాడుగుల నియోజకవర్గ తెలుగుదేశం నాయకులు పైలా ప్రసాదరావు సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. రివర్స్ టెండరింగ్‌తో మొదలైన పాలన పారిశ్రామిక వేత్తలను భయపెట్టే దాకా వచ్చిందని పేర్కొన్నారు. గత నాలుగేళ్లలో వైకాపా ప్రభుత్వ లోపాలను ఎత్తి చూపుతున్న ఈనాడు గొంతు నొక్కేందుకు మార్గదర్శిపై దాడులు, కేసులకు తెగబడ్డారని విమర్శించారు. మంచి పేరున్న బ్రహ్మయ్య అండ్ కో ఆడిట్ సంస్థ భాగస్వామి శ్రావణ్‌ను కూడా అరెస్టు చేశారని తెలిపారు. ఆడిటర్లు వున్న నియమ, నిబంధనలనూ తుంగలోకి తొక్కే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని పైలా విమర్శించారు.

మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం

-సాగు, రవాణా నివారణపై పటిష్ట ప్రణాళిక
-మత్తు పదార్థాల విక్రయ ప్రాంతాల్లో నిఘా
-కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి, చిత్రంలో ఎస్‌పి తదితరులు

ప్రజాశక్తి -అనకాపల్లి

మాదకద్రవ్యాలు సాగు చేయడం, రవాణా, అమ్మకాలపై నిఘా పెంచుతూ ఉక్కు పాదం మోపాలని జిల్లా కలెక్టర్ రవి పఠాన్ శెట్టి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం మాదకద్రవ్యాల నిరోధక శాఖ రూపొందించిన జాయింట్ యాక్షన్ ప్లాన్ అమలుపై ఎస్పీ గౌతమి సాలితో కలసి పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తుపదార్థాల నియంత్రణకు నెలవారి యాక్షన్ ప్లాన్ ఉండాలని, మాదకద్రవ్యాల వినియోగాన్ని నిరోధించాలని సూచించారు. మత్తు పదార్థాల, మాదకద్రవ్యాల వినియోగం వల్ల వచ్చే అనర్థాలను పాఠశాలలు, కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించాలని, గోడలపై 14500 టోల్ ఫ్రీ నెంబర్లు వేయాలని ఆదేశించారు. మండల గ్రామస్థాయిలో కమిటీలు వేయాలన్నారు. మత్తు పదార్థాల రవాణా గుర్తించిన వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ తో పాటు పోలీసులకు, రైల్వే, ఆర్టీసీ అధికారులకు తెలియజేయాలని కోరారు. ఎస్పీ గౌతమి సాలి మత్తు పదార్థాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. జిల్లాలో గంజాయి పంటను సమూలంగా నాశనం చేశామన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ విజయభాస్కర్, అనకాపల్లి, నర్సీపట్నం ఆర్డీవోలు చిన్ని కృష్ణ, జయరాం, డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ హేమంత్, జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు, అదనపు ఎస్పీ క్రైమ్ సత్యనారాయణ, డీఎస్పీలు మహేశ్వరరావు, పి శ్రీనివాసరావు, కే ప్రవీణ్, రైల్వే, ఆర్టీసీ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న వికలాంగులు

ప్రజాశక్తి -అనకాపల్లి

వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న వందలాది వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి బుగిడి నూక అప్పారావు డిమాండ్ చేశారు. స్థానిక కలెక్టరేట్ కార్యాలయం ముందు సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టి పోస్టులు పెంచాలన్నారు. ప్రైవేటు సెక్టార్లో వికలాంగులకు రిజర్వేషన్ ద్వారా ఉపాధి కల్పించాలన్నారు. 2016 దివ్యాంగుల హక్కుల చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాపేటి భాస్కరరావు, బుద్ధ ధనలక్ష్మి, ఆడారి అన్నపూర్ణ, బోండా లక్ష్మి, కష్టవేణి, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

డిఆర్ఓ వెంకటరమణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాలో వేలాదిమంది నిరుద్యోగ వికలాంగులు ఉన్నారని, సుమారు 100కు పైగా ఉన్న ప్రభుత్వ శాఖల్లో పదుల సంఖ్యలో వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వడం దారుణమన్నారు. జీవో నెంబర్ 99 ప్రకారం రోస్టర్ ఇంటర్ చేంజ్ చేయాలన్నారు. శారీరక వికలాంగుల రోస్టర్ పాయింటు పడికి తగ్గించి వారి

జిల్లాస్థాయి ఓపెన్ కబడ్డీ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-సబ్బవరం

మండలంలోని టెక్కలిపాలెం గ్రామదేవత దుర్గమాంబ అమ్మవారి పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి ఓపెన్ కబడ్డీ టోర్నమెంట్‌ను మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి సోమవారం ప్రారంభించారు. సర్పంచ్ కుమారుడు గొంప వెంకటరమణ (ఎన్ఆర్ఐ) ఆర్థిక సహాయంతో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా బండారు మాట్లాడుతూ గ్రామీణ యువకులక్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఈ క్రీడలు దోహద పడతాయన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసాన్ని, శారీరక దారుఢ్యాన్ని పొందవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గండి దేముడుబాబు, టిడిపి నాయకులు గండి రవికుమార్, భరణికన బాబూరావు, పిబివిఎస్ఎన్‌రాజు, గవర అప్పారావు , తమరాన బంగారునాయుడు, బైలపూడి సత్యం, జి సత్యనారాయణ, గొంప వెంకటరమణ గ్రామ సర్పంచ్ గొంప సత్యవతమ్మ, నాయనప్ప, మాజీ ఎంపీటీసీ పైల వెంకటరమణ, మాజీ సర్పంచ్ పంచాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మాజీ మంత్రి బండారు

ముమ్మరంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది గ్రామపంచాయతీలో ఈవో లోవరాజు ఆధ్వర్యంలో గత రెండు రోజుల నుండి పంచాయతీ పారిశుధ్య సిబ్బంది పారిశుధ్యాన్ని మెరుగుపర్చే కార్యక్రమం చేపట్టారు. డ్రైనేజీ కాలువలు శుభ్రం చేసి పూడిక తొలగిస్తున్నారు. గ్రామమంతా దోమల మందు స్ప్రేయింగ్ చేశారు. కొత్తూరు, నాలుగు రోడ్ల కూడలి, సంతబయలు, దొరబాబు కాలనీ, పెద్ద బజారు వీధి చిన్న బజారు వీధి, బ్రాహ్మణ వీధులలో ఫాగింగ్ చేశారు. అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యాన్ని ఎప్పటికప్పుడు మెరుగుపరుస్తున్నామని ఈవో లోవరాజు తెలిపారు.

అర్జీదారులకు సంతృప్తికర పరిష్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి : స్పందన కార్యక్రమంలో తమ సమస్యల పరిష్కారం వచ్చిన అర్జీదారులకు సంతృప్తి కరమైన పరిష్కారం చూపించాలని కలెక్టర్ రవి పఠాన్ శెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో జెసి కల్పనా కుమారి, డిఆర్ఓ వెంకటరమణతో కలిసి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ స్పందన సమస్యల పరిష్కారం కోసం నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. ప్రతి దరఖాస్తును 24 గంటల్లోగా సమస్యను పరిష్కరించడం తిరస్కరించడమా అనేది అర్జీదారునికి తెలియజేయాలని సూచించారు. మండల స్థాయిలో క్వాలిటీ డిస్పోజల్ పెరగాలన్నారు. సోమవారం స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 183 దరఖాస్తులు వచ్చాయి. వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జనసేనలో 100 మంది చేరిక

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని తుమ్మపాల మేజర్ పంచాయతీలో వైసీపీ యువ నాయకులు పల్లేల గణేష్ సుమారు వందమంది అనుచరులతో సోమవారం జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పరుచూరి భాస్కరరావు ఆధ్వర్యంలో ఆ పార్టీలో చేరారు. వారందరికీ పరుచూరి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ అవినీతి చర్యలను, ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ ప్రజలను చైతన్యం చేయాలన్నారు. పల్లేల గణేష్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి తన శక్తివంతం లేకుండా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీరామదాసు గోవిందరావు, తాడి రామకృష్ణ, కనుబుద్ది వెంకట నరసింహారావు, గంజి సత్య రావు, దూలం గోపి, అధిక సంఖ్యలో జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపి సమావేశాన్ని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : విశాఖపట్నం వి కన్వెన్షన్ సెంటర్లో ఈనెల ఐదున జరిగే టిడిపి జోన్ వన్ సమావేశాన్ని విజయవంతం చేయాలని అనకాపల్లి జిల్లా పార్టీ అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు హాజరవుతున్న నేపథ్యంలో పొలిట్ బ్యూరో సభ్యులు, సెంట్రల్ కమిటీ సభ్యులు, జోనల్ ఇన్చార్జ్, అనకాపల్లి, విశాఖపట్నం కోఆర్డినేటర్స్, పార్లమెంటరీ కమిటీ అధ్యక్షులు, సభ్యులు, పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులు, పార్లమెంటుకు పోటీ చేసిన అభ్యర్థులు, నియోజకవర్గ ఇన్చార్జిలు, రాష్ట్ర కమిటీ సభ్యులు, పార్లమెంటరీ పార్టీ ప్రధాన కార్యదర్శి, డివిజన్ శాఖ పట్టణ శాఖ మండల శాఖల అధ్యక్ష కార్యదర్శులు, క్లస్టర్ ఇన్చార్జిలు యూనిట్ ఇన్చార్జిలు హాజరు కావాలని కోరారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యవంతమైన సమాజం

ప్రజాశక్తి-సబ్బవరం : పౌష్టికాహారంతో ఆరోగ్యవంతమైన సమాజాన్ని ఏర్పాటు చేయవచ్చునని స్థానిక ఎంపీపీ బోకం సూర్యకుమారి రాము నాయుడు అన్నారు. మండలంలోని గుల్లేపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జరిగిన పోషణ పక్వాడా కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బండారు మంగ శ్రీనివాస్, ఉప సర్పంచ్ గజ్జి దేముడుబాబు, కార్యదర్శి బ్రహ్మ, సూపర్వైజర్ స్వర్ణ, రెడ్డి శాంతికుమారి, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు, గర్భిణులు, బాలింతలు, పాల్గొన్నారు.

పరవాడ : మేజర్ పంచాయతీ పరవాడలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషన్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఐసిడిఎస్ సబ్బవరం ప్రాజెక్ట్ పరవాడ మండలం పరవాడ గ్రామ అంగనవాడి కేంద్రాలు పరిధిలో హెల్త్ బేబీ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంపీపీ పైల వెంకట పద్మా లక్ష్మీ శ్రీనివాసరావు పౌష్టికాహారం ప్రదర్శనను తిలకించారు. ఈ కార్యక్రమంలో పరవాడ సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు, పరవాడ ఉప సర్పంచ్ బండారు రామరావు, పెందుర్తి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ పైల అప్పలనాయుడు, పంచాయతీ కార్యదర్శి అచ్యుతరావు, వైసిపి నాయకులు చీపురుపల్లి శ్రీనివాసరావు, పైల పైడం నాయుడు, అంగనవాడి టీచర్లు, ఏఎన్ఎంలు ఇందిర, రత్నం పాల్గొన్నారు.

ప్రపంచ శాంతికి బుద్ధుని మార్గాలే ఆచరణీయం

ప్రజాశక్తి- అనకాపల్లి : ప్రపంచ శాంతికి బుద్ధుడి శాంతి మార్గాలే ఆచరణీయమని విజయవాడ ప్రసిద్ధ బౌద్ధ భిక్షువు కేకే బోధి అన్నారు. ప్రసిద్ధ బౌద్ధారామ క్షేత్రం బొజ్జన్న కొండ వద్ద ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా అనకాపల్లి జిల్లా శాఖ ఆధ్వర్యంలో పల్లా బాబ్జి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. బౌద్ధ మతాన్ని స్వీకరించడం, అనుసరించడం ద్వారా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రపంచానికే ఆదర్శం అయ్యారన్నారు. బౌద్ధ మతాన్ని మరింత విస్తృత స్థాయిలో ప్రచారం చేయాలన్నారు. ప్రతి నెలలో ఒక ఆదివారం బొజ్జన్న కొండ వద్ద సమావేశాలు నిర్వహించేందుకు సమావేశం తీర్మానించింది. ఈ సమావేశంలో సొసైటీ సభ్యులు మాటూరి శ్రీనివాసరావు, బాలరాజు, వై హరిబాబు, శంకర్ ప్రసాద్, పండు రామారావు, దయాళ్రాజు, నూకరాజు, కొండలరావు, పావాడ సన్యాసిరావు పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ'కి తరలివెళ్లిన కార్మిక నేతలు



నర్సీపట్నం నుంచి చలో ఢిల్లీకి బయలుదేరిన కార్మిక నేతలు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: ఈనెల 5న చలోఢిల్లీ పార్లమెంటు మార్చ్ ఆందోళనకు నర్సీపట్నం నుంచి 20 మంది భవన నిర్మాణ, ముఠా, కాఫీ, తదితర సంఘాల కార్మిక నాయకులు పయనమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో రెండోసారి బిజెపి ప్రభుత్వం చేపట్టిన తర్వాత అనుసరించిన కార్మిక, రైతు, వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఆందోళనకు తరలివెళుతున్నామన్నారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు డి సత్తిబాబు, కార్యదర్శి అడిగర్ల రాజు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి, అనకాపల్లి భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కె.రామకృష్ణ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ సత్తిబాబు, ముఠా కార్మిక సంఘం నాయకులు నానాజీ, గోవింద్, కాఫీ కార్మిక సంఘం నాయకులు నూకరత్నం ఉన్నారు.

అనకాపల్లి : కేంద్ర ప్రభుత్వం కార్మిక కర్షక ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని కోరుతూ ఈనెల ఐదున ఢిల్లీలో చేపట్టనున్న ధర్నాకు అనకాపల్లి నుంచి సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సోమవారం తరలివెళ్లారు. వీరికి ఆయా సంఘాల నాయకులు దొడ్డి రాము నాయుడు కార్మిక కర్షక నిలయం నుంచి నెహ్రూ చౌక్ జంక్షన్ వరకు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకర్రావు, కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ బాలకృష్ణ మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక కర్షక ప్రజా వ్యతిరేక విధానాలపై అనేక ఉద్యమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి వివి శ్రీనివాసరావు, బొప్పె ఉమామహేశ్వరరావు, బిశెట్టి అప్పారావు, బోడి రాజు, నాగిరెడ్డి సత్యనారాయణ, ఎస్ఎఫ్ఐ నాయకులు తరుణ్, సురేష్, చలపతి తదితరులు పాల్గొన్నారు.



అనకాపల్లి నుంచి బయలుదేరి వెళుతున్న నేతలు

మల్కాపురంలో పాదయాత్ర



పాదయాత్రలో పాల్గొన్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి -ములగాడ : చలో ఢిల్లీని జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు మల్కాపురంజోన్ కమిటీ ఆధ్వర్యాన 58వ వార్డు పరిధి గుల్లలపాలెం, కుంచమ్మకాలనీ, రాంనగర్ ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మల్కాపురం జోన్ కార్యదర్శి ఆర్.లక్ష్మణమూర్తి మాట్లాడుతూ, కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 5న ఢిల్లీలో చేపట్టే కార్యక్రమాలకు మద్దతుగా జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద తెలిపే నిరసన కార్యక్రమానికి కార్మికులు, రైతులు వ్యవసాయ కార్మికులు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ పాదయాత్రలో సిఐటియు జోన్ అధ్యక్షులు కె.పెంటారావు, జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జోన్ అధ్యక్షులు కె.రమణ, నాయకులు బి.సూరిబాబు, బి.రాంబాబు, మురళీ, డి.రాము, రమణమ్మ, అప్పలకొండ, సీత,

చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న మోహన్‌రావు

ప్రజాశక్తి-గొలుగొండ : చిరుధాన్యాల సాగుపై రైతులంతా దృష్టి సారించాలని నర్సీపట్నం డివిజన్ అగ్రికల్చరల్ డైరెక్టర్ మోహన్‌రావు అన్నారు. సోమవారం మండలంలో జోగంపేట ఆర్‌బికెను సందర్శించారు. కేంద్రంలో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిరుధాన్యాల సాగుపై కేంద్ర ప్రభుత్వం పలు ప్రోత్సాహకాలు అందిస్తోందని, రైతులు రాగులు, గంటెలు, కొర్రలు వంటి చిరుధాన్యాల సాగుపై దృష్టి పెట్టాలని కోరారు. పోషకాలు ఎక్కువగా ఉన్న చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడానికి ప్రజలు మొగ్గు చూపుతున్న పరిస్థితుల్లో వీటికి మంచి డిమాండ్, ధర ఉంటుందన్నారు. చిరుధాన్యాల సాగుపై సూచనలు సలహాలు చేశారు. కార్యక్రమంలో జోగంపేట సచివాలయ అగ్రికల్చరల్ అసిస్టెంట్ సత్యవేణి, వైసిపి నాయకులు జక్కు చిన అప్పలస్వామి నాయుడు, పెద్దిరెడ్ల అప్పలనాయుడు పాల్గొన్నారు .

ఉపాధి హామీ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-మాడుగుల : మండల కేంద్రంలో ఉపాధి హామీ పనులను సోమవారం ప్రారంభించారు. ఎంపిపి పెదబాబు, సర్పంచ్ ఎడ్ల కళావతి, వైస్ సర్పంచ్ శ్రీనాధు శ్రీనివాసరావు పాల్గొని, ఉపాధి పనులను ప్రారంభించారు. వీటితోపాటు అది,సోమ వారాలలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం జరిగింది. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ఆదేశాల మేరకు 14వ వార్డు పరిధిలోని అర్బన్, టీచర్స్ కాలనీలలో కాలువలు, రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సోమవారం ఉపాధి హామీ పనులు ప్రారంభం అయ్యాయి. కార్యక్రమంలో వైసిపి నేతలు కుక్క ర మహేశ్వరి, మోదకొండ, బొమ్మి శెట్టి శ్రీను, జాంటి, అచ్యుతం, రాఖీ శ్రీను పాల్గొన్నారు.

16న రాష్ట్ర సదస్సుకు తరలిరండి

ప్రజాశక్తి-గొలుగొండ : ఈ నెల 16న విజయవాడ మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో సామాజిక విప్లవ రణభేరి రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ పుత్తడి గైరంపేటలో జైభారత్ సంస్థ ఆధ్వర్యంలో సర్పంచ్ పత్తి రమణ కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జైభారత్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి జివి.రమణ మాట్లాడుతూ కులవివక్ష నిర్మూలన, అసమానతల అంతమే లక్ష్యంగా జైభారత్ ఎస్‌సి, ఎస్‌టి, బిసి పోరాటసంస్థల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించే సదస్సుకు ఉద్యమ అభిమానులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో జైభారత్ ఎస్‌సి పోరాట వేదిక ఉపాధ్యక్షులు ఎం.త్రిమూర్తులు, బిసి నాయకులు పుత్తడి నానాజీ, పోనగంటి గణేష్, రావుల కొండలరావు, పత్తి మల్లేష్, పుత్తడి శ్రీను, ఎస్‌సి నాయకులు వారా రమణ పాల్గొన్నారు.

ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం



మోదమ్మ ఆలయం నూతన కమిటీ సభ్యులు

ప్రజాశక్తి-మాడుగుల : మండల కేంద్రంలోని మోదకొండమ్మ ఆలయ నూతన కమిటీ సోమవారం ప్రమాణ స్వీకారం చేసింది. ప్రతి రెండేళ్లకు గ్రామంలోని ఒక్కో వార్డుకు ఒకరు సభ్యులు చొప్పున 16మంది సభ్యులను లాటరీ పద్ధతిలో ఎన్నుకోవడం కొన్నేళ్లుగా ఆనవాయితీగా వస్తోంది. దీన్ని కొనసాగిస్తూ లాటరీ పద్ధతిని ఎన్నికైన కొత్త కమిటీతోపాటు ప్రధాన కమిటీ ప్రమాణ స్వీకారం చేసింది. ఆలయ కమిటీ అధ్యక్షులు అప్పలరాజు, కార్యదర్శి శ్రీనాథ్ శ్రీనివాసరావు, సభ్యులు దంగేటి సూర్యరావు, పైడి నాయుడుతో పాటు నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు భవానీ శంకర్, టిడిపి నేత కె. మల్లికార్జునుడు పాల్గొన్నారు

అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకోం

ప్రజాశక్తి -నర్సీపట్నం రూరల్ : రాజకీయాల్లోకి వచ్చిన నాటి నుండి ఇప్పటివరకు పంచాయతీ అభివృద్ధికి పనిచేసిన తనపై అసత్య ఆరోపణలు చేస్తే పరువునష్టం దావా వేస్తానని మండలంలోని గబ్బాడ సర్పంచ్ ఈర్లి రాజేశ్వరిరాజబాబు హెచ్చరించారు. సోమవారం తన నివాసంలో విలేకర్లతో మాట్లాడుతూ, పంచాయితీ సెక్రటరీ సరైన సమాచారం ఇవ్వకపోతే సర్పంచ్‌గా తనకేంటి సంబంధమని, తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్న తమరాన గోవిందరావుపై ధ్వజమెత్తారు. ఆర్‌టిఐ చట్టం ప్రకారం గోవిందరావు సమాచారం కోరితే, సెక్రటరీ ఇచ్చారని, అది తప్పుడు సమాచారమైతే సెక్రటరీని ప్రశ్నించాలేగానీ తనకేంటి సంబంధమని ప్రశ్నించారు. తనకు తెలియకుండానే సెక్రటరీ కొన్ని అనధికార లేఅవుట్లకు అనుమతులిచ్చారని, దీనిపై తాను ఫిర్యాదు చేస్తే ఉన్నతాధికారులు దర్యాప్తు చేస్తున్నారన్నారు. నిబంధలనకు వ్యతిరేకంగా చేపడుతున్న ఇళ్ల నిర్మాణంపై తాను కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తే, తనపై గోవిందరావు అవాస్తవ ఆరోపణలు చేశారన్నారు. దీనికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని, లేకుంటే పరువునష్టం దావా వేస్తానన్నారు. వైస్ సర్పంచ్ మాకిరెడ్డి రాజబాబు, గ్రామ పెద్దలు, మాజీ ఎంపిటిసి ఈర్లే రాజబాబు, పెట్ల అప్పల నాయుడు, యమాల సత్యనారాయణ పాల్గొన్నారు.

వర్క్‌షాప్‌లో ఎమ్మెల్యేకు క్లాస్ పీకిన సిఎం!

సామాజిక మాధ్యమాల్లో వార్తలు హల్‌చల్

ప్రజాశక్తి కోటవురట్ల : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సోమవారం గడపగడపకు కార్యక్రమంపై నిర్వహించిన వర్క్ షాప్‌లో స్థానిక గొల్ల బాబురావుకు తీవ్రస్థాయిలో క్లాసు పీకినట్లు ప్రచార మాధ్యమాలతో పాటు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వచ్చే ఎన్నికల్లో సీటు దక్కదని, ఒకవేళ సీటిచ్చినా గెలిచేది పరిస్థితి లేదని, అధికార పార్టీ నాయకులే నియోజకవర్గ వ్యాప్తంగా ఎమ్మెల్యే పనితీరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి జగన్ దృష్టికి వెళ్లినట్లు సమాచారం. సంక్షేమ పథకాలపై ప్రచారం తప్పిస్తే, నియోజకవర్గంలో ఏ ప్రాంతాన్ని ఎమ్మెల్యేగా బాబూరావు అభివృద్ధి చేసిన దాఖలాలు లేవనే విమర్శలున్నాయి. పాయకరావుపేట ప్రధాన రహదారి విస్తరణ, ఏటికొప్పాక తాండవ చక్కెర కర్మాగారాల మూసివేత, తాండవ, వరాహనది ఇరువైపులా పటిష్ట గట్లు నిర్మాణం, రాయవరంలో జూనియర్ కళాశాల నిర్మాణం హామీ, డిగ్రీ కళాశాలకు శాశ్వత భవనాలు లేక విద్యార్థులు ఇక్కట్లు, పాయకరావుపేట, నక్కపల్లి ,రాయవరం, మండలాలకు తాగునీటి కోసం రూ.210 కోట్లతో ఉద్దండపురం వద్ద నిర్మించ తలపెట్టిన ప్రాజెక్టు పనులు నిలిచిపోవడం, నక్కపల్లి మండలంలో హెటిరో పైపులైనుకు వ్యతిరేకంగా మత్స్యకారులు 480 రోజులుగా ధర్నా చేస్తున్నా పట్టించుకోకపోవడం, కోటవురట్ల మండలంలో పలు రహదారులు అసంపూర్తిగా వదిలివేయడం, జల్లూరు, పందూరు వంతెన అసంపూర్తి పనులు, ఇలా సమస్యలన్నీ ఎక్కడికక్కడే పేరుకుపోయినా వాటి పరిష్కారానికి ఎమ్మెల్యే ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని ముఖ్యమంత్రి దృష్టికి వెళ్లినట్లు సమాచారం. అంతేకాకుండా ఇటీవల కాలంలో పలు అవినీతి ఆరోపణలు సైతం నియోజకవర్గ స్థాయిలో వినిపిస్తున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో గెలిచే వ్యక్తులను పోటీబరిలో దింపేదుకు ముఖ్యమంత్రి జగన్ నిర్వహించిన వర్క్‌షాప్‌లో అన్ని విభాగాల్లో విఫలమైనట్లు భావించినందువల్లే ఎమ్మెల్యే బాబూరావుకు ముఖ్యమంత్రి జగన్ పెద్దక్లాసే పీకారని ప్రచారం జరుగుతోంది. టికెట్టు ఇచ్చినా గెలిచే అవకాశం లేని వారిలో గొల్ల బాబూరావు ఉన్నారని అధికార, ప్రతిపక్ష నాయకుల్లో చర్చ సాగుతున్న నేపథ్యంలో, సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్న విషయాలన్నీ నిజమేనా అని సర్వత్రా చర్చ జరుగుతోంది. దీనిపై అటు వైసిపి అధిష్టానంగానీ, ఇటు ఎమ్మెల్యేగానీ క్లారిటీ ఇస్తేగానీ వాస్తవాలేంటే తెలియని పరిస్థితి.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ప్రజాశక్తి-గొలుగొండ : ప్రభుత్వ పథకాలను గృహసారథులు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని గొలుగొండ జెడ్‌పిటిసి సుర్ల గిరిబాబు, ఎంపిపి గజ్జలపు మణికుమారి కోరారు. జగనన్నే మా భవిష్యత్ అనే కార్యక్రమంలో భాగంగా సోమవారం చోద్యం, లింగంపేట, కొత్తమల్లంపేట, గొలుగొండ గ్రామ సచివాలయాల్లో గృహ సారథులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న పథకాలపై ఈ నెల 7 నుంచి ఇంటింటికీ వెళ్లి వివరించడంతోపాటు ప్రజాభిప్రాయాలను తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల సచివాలయ కన్వీనర్ల సంఘం అధ్యక్షులు కొరుప్రోలు పాణి శాంతారామ్, సర్పంచ్‌లు సంతోష్, కసిపల్లి బుజ్జి, రాజబాబు, గృహ సారథులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

శతశాతం ఇంటి పన్ను వసూలు లక్ష్యం

ప్రజాశక్తి- నక్కపల్లి: నిర్ధేశిత సమయంలో శతశాతం ఇంటి పన్ను వసూలు చేయాలని ఎంపిడిఒ సీతా రామ రాజు, ఇఒపిఆర్‌డి వెంకట నారాయణ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచా యతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు.



మాట్లాడుతున్న ఎంపిడిఒ సీతారామరాజు

పంచాయతీల వారీగా ఇంటి పన్నులు వసూళ్లపై ఆరా తీశారు. సకాలంలో ఇంటి పన్నులు వసూలు చేసి లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు . ఆయుష్మాన్ భారత్ కార్డులు, ఇకెవైసి త్వరగతిన నమోదు చేయాలన్నారు. ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధాన ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. స్పందనలో వచ్చే ఫిర్యాదులపై చర్చించి, పరిష్కరించాలని సూచించారు. గ్రామాల్లో శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు

ఆసుపత్రిలోకి ఆరుబయట ఆహారం

ప్రజాశక్తి -నర్సీపట్నం రూరల్ : నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో కొద్ది రోజులుగా బయట వ్యక్తులు వచ్చి రోగులకు ఆహారం విక్రయిస్తున్నారని, అది తిన్న తర్వాత ఏమైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని అభివద్ధి కమిటీ సభ్యులు ఆరుగొల్లు రాజబాబు ఆరోపించారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఆసుపత్రిలోకి అనధికారిక వ్యక్తులకు బయట నుంచి వచ్చి ఆహారాన్ని విక్రయిస్తుంటే ఆసుపత్రి సిబ్బంది ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. బాధ్యులపై తగు చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్ డాక్టర్ నీలవేణిని కోరారు. విషయాన్ని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ దృష్టికి తీసుకెళ్తానన్నారు.

పెద్దచెరువు ఆక్రమణపై స్పందనలో ఫిర్యాదు

ప్రజాశక్తి -నర్సీపట్నం రూరల్ : నర్సీపట్నం కేడిపేట పోవు రోడ్డు మార్గంలో పెద్ద చెరువు మదుం వద్ద ఆక్రమించి ఇల్లు నిర్మాణం చేపట్టడంపై శివపురానికి చెందిన ఏకా వీర వెంకట సత్యనారాయణ సోమవారం స్పందనలో ఆర్‌డిఒ జయరాంకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ చెరువును కబ్జా చేసి అక్రమంగా ఇంటి నిర్మాణం చేస్తున్నారన్నారు. చెరువులోకి నీరు వచ్చే కాలువను కబ్జా చేసి రోడ్డు వేసుకున్నారన్నారు. దీనిపై అధికారులు స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.

వైసిపి పాలనలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం

మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు



'ఇదేం ఖర్మ'లో మాట్లాడుతున్న మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి-గొలుగొండ : వైసిపి పాలనలో రాష్ట్రంలోని వ్యవస్థలను నిర్వీర్యం చేశారని మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆరోపించారు. సోమవారం సాయంత్రం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా మండలంలోని లింగంపేట, గింజర్తి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభల్లో మాట్లాడుతూ, వైసిపి పాలనలో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందన్నారు. మద్యం, ఇసుక అమ్మకాల్లో అవినీతికి పాల్పడటమే కాకుండా మద్యపాన నిషేధం అంటూ మహిళలను మోసగించారన్నారు. పెరిగిన నిత్యావసరాలతో సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో వైద్య సేవలు అస్తవ్యస్తంగా మారాయన్నారు. పేదలకు కడుపు నింపే అన్నా క్యాంటీన్లను ఎత్తేశారని, ఉపాధి హామీ పనులను నిర్వీర్యం చేశారన్నారు. పంచాయతీల్లో సర్పంచ్‌లకు ఎటువంటి గౌరవం ఉండటం లేదన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగం పెరిగిపోయిందని, ఏటా జాబ్‌క్యాలెండర్ అని చెప్పి యువతను మోసం చేశారన్నారు. దుర్మార్గమైన వైసిపి పాలనకు 2024 ఎన్నికల్లో చరమగీతం పాడాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు అప్పలనాయుడు, సీనియర్ నాయకులు చిటికెల సాంబమూర్తి, నర్సీపట్నం కౌన్సిలర్లు చింతకాయల రాజేష్, ధనిమిరెడ్డి మధు, చోద్యం సర్పంచ్ ఆదపురెడ్డి గోపాలకృష్ణ, మాజీ సర్పంచ్ సుర్ల బాబ్జీ, పరవాడ అప్పలనాయుడు గ్రామ కమిటీ అధ్యక్షులు మరిసా రమణ, అనకాపల్లి పార్లమెంటరీ టీఎన్ఎస్ఎఫ్ ఉపాధ్యక్షులు గోలకొండ శ్రీకాంత్ నరసింగరావు తదితరులు పాల్గొన్నారు

మాడుగులలో....

మాడుగుల: వైసిపి ప్రభుత్వంలో పంచాయతీ వ్యవస్థ నిర్వీర్యమైందని టిడిపి ప్రధాన కార్యదర్శి వుందూరు దేముడు ఆరోపించారు. సోమవారం స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయంలో పంచాయతీ సర్పంచుల రెండేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా టిడిపి ఆధ్వర్యాన నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చినప్పటి నుండి పంచాయతీ సర్పంచులకు పూర్తి స్వేచ్ఛ, హక్కులు ఉండేవని, పంచాయతీ పరిధిలో ఏపని జరగాలన్నా సర్పంచ్, పాలకమండలి ఆమోదంతోనే జరిగే పరిస్థితి ఉండేదన్నారు. కానీ వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామపంచాయతీలకు నిధులు, విధులు లేకుండా నిర్వీర్యం చేసేశారని, పంచాయతీల్లో తాగునీరు, పారిశుధ్య పనులు, వీధిదీపాలకు సైతం నిధులు లేని దౌర్భాగ్య పరిస్థితి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు కేటాయించిన తలసరి నిధులను సైతం వైసిపి ప్రభుత్వం తన్నుకుపోవడం దుర్మార్గమన్నారు. సర్పంచ్‌లు, పాలకమండలి పదవీ బాధ్యతలు చేపట్టిన గడచిన రెండేళ్లలో పంచాయతీలలో ఒక్క పని కూడా చేయలేకపోవడానికి ఇదే ప్రధాన కారణమని ఆవేదన వ్యక్తం చేశారు.

వైభవంగా పండిత సభ

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని ఉపమాక శివాలయంలో శివ,పార్వతుల వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి నిర్వహించిన సదస్యం (పండితసభ) వైభవంగా జరిగింది. ఉపమాక వెంకన్న ఆలయ ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు, అర్చకులు సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు, శివాలయం అర్చకులు వెలవలపల్లి మహేశ్, ఆలయ చైర్మన్ చెరుకూరి వెంకటేశ్వర ఆధ్వర్యంలో పండిత సభ నిర్వహించారు. కర్ణాటకకు చెందిన వేదపాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస కులకర్ణి, అమలాపురానికి చెందిన వేదపాఠశాల స్మార్త అధ్యాపకులు ఆకొండి సాయి శర్మ, ఎలమంచిలి వేదపాఠశాల విద్యార్థులు సదస్యం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు ఈ సందర్భంగా వేదపండితులను నక్కపల్లికి చెందిన శింగంశెట్టి బాపన్నశెట్టి కుటుంబసభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీ రామకృష్ణ, డీవీఎస్ రావు, శింగంశెట్టి నానీ, ఉప సర్పంచ్ ప్రగడ వీరబాబు, గురుభవానీ రాంబాబు, గోర్స అప్పలాచారి, కాసుబాబు పాల్గొన్నారు.

వైజాగ్, చెన్నయ్ ఇండస్ట్రియల్ కారిడార్ నిర్వాసితులకు

నష్టపరిహారం చెల్లింపులో వివక్ష

తహశీల్దార్ కార్యాలయం వద్ద రైతుల ఆందోళన, వినతిపత్రం అందజేత



తహసీల్దార్ నీరజకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

ప్రజాశక్తి -నక్కపల్లి: వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా పరిశ్రమల స్థాపన కోసం ఏర్పాటు చేస్తున్న రోడ్డుకు సంబంధించి సేకరించిన భూములకు నిర్వాసితులందరికీ ఒకేరకమైన నష్టపరిహారం చెల్లించాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు ,రైతులు డిమాండ్ చేశారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద నిర్వాసిత రైతులు ధర్నా చేపట్టారు. ఒకే విధంగా నష్ట పరిహారం చెల్లించి, న్యాయం చేయాలని నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా అప్పలరాజు రైతులు మాట్లాడుతూ మండలంలోని న్యాయంపూడి, కాగిత, వేంపాడు రెవిన్యూ పరిధిలో రైతుల నుండి భూములు సేకరించి రోడ్డు వేయడానికి సన్నాహాలు చేస్తున్న అధికారులు, నిర్వాసితులకు వేర్వేరు నష్టపరిహారం చెల్లించడం దుర్మార్గమన్నారు. ఆయా భూముల్లో కొబ్బరి, మామిడి, జీడితోటలు వేసి జీవనోపాధి పొందుతున్న రైతులకు రోడ్డు పనులకు భూములివ్వడం వాస్తవానికి ఇష్టం లేనప్పటికీ, పరిశ్రమలు వస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని భావించి, జీవనోపాధిని వదులుకొని, భూముల్ని త్యాగం చేసేందుకు సిద్ధపడితే, వారికి నష్టపరిహారం చెల్లింపులో వ్యత్యాసం చూపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మూడు రెవెన్యూ ప్రాంతాల్లో సేకరించిన భూములకు ఒకే విధంగా పరిహారం చెల్లించకపోవడాన్ని రైతులంతా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు.ప్రస్తుతం ఉన్న భూముల విలువ తగ్గట్టుగా నష్టపరిహారం చెల్లించకుండా తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.

వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం నక్కపల్లి మండలంలో రాజయ్య పేట నుండి దోనివాని లక్ష్మీ పురం వరకూ 5 రెవెన్యూ గ్రామాలలో 5,500 ఎకరాలు సేకరించి ఒకే విధంగా నష్టపరిహారం చెల్లించి నప్పుడు, ఆ భూముల పక్కనే మరో మూడు రెవెన్యూ గ్రామాలలో సేకరించిన భూములకు వేర్వేరుగా నష్టపరిహారం ఎలా చెల్లిస్తారని ప్రశ్నించారు .భూసేకరణ కొరకు నియమించబడిన ఎస్‌డిసి రైతులను బెదిరించేలా మాట్లాడడడం దుర్మార్గమన్నారు.

నిర్వాసితులందరికీ ఒకేరకమైన నష్టపరిహారంతోపాటు 18 ఏళ్లు నిండిన వారికి ఆర్ కార్డులు ఇచ్చి, ఏర్పాటు చేయనున్న పరిశ్రమలలో శాశ్వత ప్రాతిపాదికన ఉద్యోగం ఇవ్వాలని, 2013 భూసేకరణ చట్టం ప్రకారం జీరాయితీ, డి ఫారం, ఇతరత్రా ఎటువంటి సాగుభూములైనా ఒకేరకమైన పరిహారం, ప్యాకేజీ చెల్లించాలని, చెట్లు, నిర్మాణాలు, పసువుల పాకలకు కొత్త జీవో ప్రకారం నష్టపరిహారం, చెల్లించాలని కోరుతూ తహశీల్దార్ నీరజకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతులు ఎన్ ఈశ్వరరావు, సుబ్బరాజు, రోకళ్ళ శ్రీను, నాగేశ్వరరావు సత్యనారాయణ, శ్రీనివాసరావు, రమణ పాల్గొన్నారు .

నర్సీపట్నం మున్సిపల్ వైస్‌చైర్మన్ రాజీనామా

ఊహాగానాలకు తెరదించిన నరసింహమూర్తి



రాజీనామా పత్రాన్ని అందిస్తున్న నరసింహమూర్తి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : గత పక్షం రోజులుగా అనేక మలుపులు, ఊహాగానాలను పటాపంచలు చేస్తూ నర్సీపట్నం మున్సిపల్ వైస్‌చైర్మన్ గొలుసు నరసింహమూర్తి సోమవారం సాయంత్రం రాజీనామా చేశారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ కనకారావుకు రాజీనామా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ, వైసిపి ఆవిర్భావం నుంచి పార్టీ కోసమే కష్టపడి పనిచేస్తూ 2019లో నర్సీపట్నం ఎమ్మెల్యేగా పెట్ల ఉమా శంకర్ గణేష్‌ను గెలిపించుకున్నామన్నారు. అనంతరం 2021లో జరిగిన మునిసిపల్ ఎన్నికలలో మున్సిపాలిటీని వైసిపి కైవసం చేసుకోగా, ఎమ్మెల్యే ఆదేశానుసారం మున్సిపల్ వైస్‌చైర్మన్‌గా తాను ప్రమాణ స్వీకారం చేశానన్నారు. అప్పట్లో ప్రమాణం స్వీకారం రోజునే అనుకున్న ఒప్పందం ప్రకారం రెండేళ్ల తర్వాత చైర్మన్, వైస్ చైర్మన్ల మార్పు జరుగుతుందని ఎమ్మెల్యే ప్రకటించారన్నారు. దాని ప్రకారం గత నెల 18వ తేదీకే రెండేళ్ల పదవీకాలం పూర్తయిందని, అందుకే రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. కొన్ని రోజులు రాజీనామా ఆలస్యానికి కారణాన్ని వివరిస్తూ, మార్చి 29న కౌన్సిల్ సమావేశం ఉన్నందున అప్పటివరకు వేచిచూసి, ఇపుడు రాజీనామాను అందజేశానన్నారు.

ఎమ్మెల్యేతో తనకు ఎటువంటి అభిప్రాయ భేదాలు లేవనిస్పష్టం చేశారు. పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉద్దేశపూర్వకంగానే రాజీనామా చేసినట్లు నరసింహ మూర్తి వెల్లడించారు. కార్యక్రమంలో మరో మున్సిపల్ వైస్‌చైర్మన్ తమరాన అప్పలనాయుడు, వైసిపి పట్టణ అధ్యక్షుడు యాకా శివ, కౌన్సిలర్లు బోడపాటి సుబ్బలక్ష్మి, వీరమాచినేని జగదీశ్వరి, మాకిరెడ్డి బుల్లిదొర, బైపురెడ్డి చినబాబు, కోఆప్షన్ సభ్యురాలు షేక్ రోజా పాల్గొన్నారు.

నెలరోజులు తిరక్కుండానే...

జగనన్న కాలనీలో వాలిపోయిన విద్యుత్ స్తంభాలు

ప్రజాశక్తి-రోలుగుంట : రోలుగుంట మండలం కొమరవోలు గ్రామంలో జగనన్న కాలనీలో వేసిన విద్యుత్ స్తంభాలు ఇటీవల వీచిన ఈదురుగాలులకు వాలిపోయాయి. ఇక్కడ ఈ స్తంభాలు ఏర్పాటు చేసి నెల రోజులు మాత్రమే కావస్తోంది. చిన్నపాటి వర్షాలకు ఈదురుగాలలకు సైతం స్తంభాలు ఈ విధంగా వాలిపోవడంపై పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు.దీనిపై సంబంధిత అధికారులు స్పందించి, జగనన్న కాలనీల్లో సౌకర్యాలను శాశ్వతంగా ఉండేలాకల్పించాలని కోరుతున్నారు.



వాలిపోయిన విద్యుత్ స్తంభం

సిరిపురంలో ఇండియన్ బ్యాంక్ నూతన శాఖ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగరంలోని సిరిపురం వద్ద ఇండియన్ బ్యాంక్ నూతన శాఖను బ్యాంకు చీఫ్ జనరల్ మేనేజర్, హైదరాబాద్ ఎఫ్‌జిఎం కెఎస్.సుధాకర్‌రావు సోమవారం ప్రారంభించారు. జోనల్ మేనేజర్ సిహెచ్.వెంకటరమణరావు, డిజెడ్ఎం యువి.సుబ్బారావు లతో కలిసి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు శాఖను సిరిపురంలో ప్రారంభించటం సంతోషంగా ఉందన్నారు. బ్యాంక్ ప్రగతిని వివరించారు. ప్రామాణికాల్లో నెంబర్ వన్ స్థానంలో నిలిచామని తెలిపారు. సిహెచ్.వెంకట రమణరావు మాట్లాడుతూ విశాఖపట్నం జోన్ పరిధిలోకి అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలు వస్తాయన్నారు. మొత్తం 46 శాఖలతో సుమారు రూ.6800 కోట్ల వ్యాపారం నిర్వహించినట్లు పేర్కొన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఇండియన్ బ్యాంక్ విశాఖపట్నం జోన్ ఎంఎస్ఎంఇల పరిధిలో రూ.200 కోట్లను మంజూరు చేసిందని తెలిపారు. వ్యవసాయ, బంగారు రూణాల వృద్ధి రూ.175 కోట్లకు మించిందన్నారు. అనంతరం ఉత్తమ ఖాతాదారులను సత్కరించారు. అలాగే మంజూరు చేసిన ఎంఎస్ఎంఇలను ఖాతాదారులకు అందజేశారు.



మాట్లాడుతున్న ఇండియన్ బ్యాంకు సిజిఎం సుధాకరరావు

కాంట్రాక్ట్ ఉద్యోగుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న సర్వశిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: వేతన బకాయి చెల్లింపు, ఉద్యోగ భద్రత, క్రమబద్ధీకరణ ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సమగ్ర శిక్ష ఒప్పంద ఉద్యోగులు సోమవారం భోజన విరామ సమయంలో నిరసన చేపట్టారు. స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఒప్పంద ఉద్యోగులకు ఫిబ్రవరి, మార్చి నెలల వేతనాలు చెల్లించలేదని, వేతనాల పెంపు, ఉద్యోగాల క్రమబద్ధీకరణ, కనీస వేతనాలు అమలు, పిఎఫ్, ఇఎస్ఐ, ఆరోగ్యభద్రత, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్ఐఎస్. కో డేటా ఎంట్రీ ఆపరేటర్, మండల లెవెల్ అకౌంటెంట్స్, క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్, ఐఇఆర్‌టిలు, పిటిఐ.లు, మెసెంజర్స్, ఆయాలు, కెజిబివి పాఠశాలల సిబ్బంది పాల్గొన్నారు.

ఆసరా సభ ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి- రోలుగుంంట : స్థానిక జూనియర్ కళాశాల ప్రాంగణంలో మంగళవారం వైయస్సార్ ఆసరా సభ ఏర్పాట్లను సోమవారం ఎంపిపి యర్రంశెట్టి శ్రీనివాసరావు, ఎంపిడిఒ ప్రభాకరరావు, ఇతర నాయకులు పరిశీలించారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పాల్గొనే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సిఎంఆర్ సౌజన్యంతో..

అంధులకు ఆడియో స్టడీ మెటీరియల్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అంధ విద్యార్థులు, నిరుద్యోగులకు పోటీ పరీక్షలకు ఉపయోగపడే విధంగా గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4, ఇతర సివిల్ సర్వీసెస్, యుజిసి నెట్ పరీక్షల నిమిత్తం వారు విని నేర్చుకునే విధంగా ఆడియో స్టడీ మెటీరియల్‌ను సిఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ ఆర్థిక సౌజన్యంతో రూపొందించి సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంధులకు ఈ స్టడీ మెటీరియల్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఇటువంటి బృహత్తర కార్యక్రమాలకు తానెప్పుడూ ముందుంటానన్నారు. మెటీరియల్‌ను రూపొందించిన జగదీష్‌బాబు మాట్లాడుతూ మావూరి వెంకటరమణ అంధుల పాలిట ఆశాజ్యోతి అని కొనియాడారు. మెటీరియల్‌ను రూపొందించడం కోసం మావూరి వెంకటరమణ రూ.7 లక్షల ఆర్థిక సాయం అందించారన్నారు.